RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY తెలుగు దినపత్రిక

| మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 214 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | బుధవారం, ఫిబ్రవరి, 18, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- |
|---|---|---|---|---|---|
| MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 214 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Wednesday, February,18, 2026 | PAGES : 8 RS : 4 /- |




## మరోసారి ఫలించిన సీఎం రేవంత్ వ్యూహం

### ఎప్పటికప్పుడు సీఎం దిశానిర్దేశం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**అత్యధిక మున్సిపల్ చైర్మన్, మేయర్ స్థానాలను దక్కించుకోవడంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు, శ్రేణుల్లో జోష్ నెలకొన్నది. తాముఅంచనా వేసినదానికంటే ఎక్కువగానే సీట్లను సాధించామని చెబుతు న్నారు. సర్వేల అంచనాలను తలకిందులు చేస్తూ 90కి పైగా చైర్మన్, మేయర్ స్థానాలను కైవసం చేసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రులు సమిష్టిగా పనిచేయడంతో మెరుగైన ఫలితాలు సాధించామని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజామా బాద్‌లో ఎంఐఎం సహకరించ డంతో మేయర్ పీఠం దక్కించుకున్నామని కాంగ్రెస్ నేతలు చెప్తున్నారు. కరీంన గర్‌లో ఓట్లు ఎక్కువ పార్టీలకు చీలడంతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడ్డాయని, లేదంటే మేయర్ ఫలితం మరో విధంగా ఉండేదని విశ్లేషిస్తున్నారు.




## గ్లోబల్ మ్యానుఫాక్చరింగ్ కేంద్రంగా హైదరాబాద్

- నాణ్యమైన విద్యాసంస్థలకు నెలవుగా నగరం
- జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు
- రెండేళ్లగా స్పష్టమైన విజన్‌తో ముందుకు వెళుతున్నాం
- బయో ఏషియా సదస్సు ప్రారంభంలో సీఎం రేవంత్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్ అంటే చార్మినార్.. బిర్యానీ.. ఫార్మా.. సాఫ్ట్‌వేర్ అని గుర్తు.. కానీ ఇవాళ గ్లోబల్ మాన్యుఫాక్చర్‌కి కేంద్రంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. నాణ్యమైన విద్యాసంస్థలు.. ఇక్కడ ఉన్నాయి.. హైదరాబాద్ క్యాపబుల్ సెంటర్‌గా మారిందన్నారు. హైటెక్స్‌లో బయో ఏషియా 2026 సదస్సును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. ముందస్తు విజన్, పాలసీతో ముందుకు వెళు తున్నామని అన్నారు. గత రెండు సంవత్సరా ల్లోనే, జీవవిజ్ఞాన రంగంలో రూ.73,000 కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు.






## కేసీఆర్‌కు రేవంత్ రెడ్డి, పవన్ కల్యాణ్, జగన్ పుట్టిన రోజు శుభాకాంక్షలు

- సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలన్న రేవంత్
- 'ఎక్స్' వేదికగా శుభాకాంక్షలు తెలిపిన వైఎస్ జగన్

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** మాజీ ముఖ్యమంత్రి,బీఆ ర్ఎస్ అధినేత కేసీఆ ర్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుట్టిన రోజు శుభా కాంక్షలు తెలియజేశారు. ప్రజాసేవ లో నిమగ్నమవు తూ రాష్ట్రా భివృద్ధికి పాటుపడటంలో భగవం తుడు కేసీఆర్‌కు సంపూర్ణ ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించా రు.ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమ ంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్, వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డిలు కూడా కేసీఆర్‌కు పుట్టిన రోజు శు భాకాంక్షలు తెలియ జేశారు. "తెలంగాణ మాజీ సీఎం కే చంద్రశేఖర రావుకు పుట్టిన రోజు శుభాకాంక్షలు. నిండా నూరేళ్లుసుఖసంతో షాలతో,ఆరోగ్యంగా జీవించాలని కోరు కుం టున్నాను" అని జగన్ 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేశారు.




## ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్‌గా హైదరాబాద్

- లైఫ్ సైన్సెస్ రంగంలో 2030 నాటికి కొత్తగా 5 లక్షల మందికి ఉద్యోగాలు
- ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో ఒకటిగా తెలంగాణను నిలిపేలా కృషి

**మంథని,తెలంగాణ దిశ :**ఫార్మా రాజధానిగా పేరొం దిన హైద రాబాద్‌ను "ల్యాబొరేటరీ ఆఫ్ ది ఫ్యూచర్" గా తీర్చిదిద్దాల న్నదే తమ ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. 2030 నాటికి లైఫ్ సైన్సెస్ రంగంలో 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకొచ్చి... కొత్తగా 5 లక్షల మంది యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామ న్నారు. ఈ దశాబ్దం చివరినాటికి ప్రపంచంలోని టాప్ 3 లైఫ్ సైన్సెస్ క్లస్టర్లలో రాష్ట్రాన్ని ఒకటిగా నిలిపేందుకే "తెలంగాణ నెక్ట్స్-జెన్ లైఫ్ సైన్సెస్ పాలసీ(2026- 2030)" రూపొందిం చామని మంగళవారం హెచ్‌ఐసీసీ లో నిర్వహించిన "బయో ఏషియా2026" సదస్సు ఆయన వివరించారు. ఇప్పటి వరకు లైఫ్ సైన్సెస్ రంగంలో సప్లై కోసం మాత్రమే మన వైపు చూసిన ప్రపంచం ఇప్పుడు ప్రస్తుతం ఈ రంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల కోసం చూస్తోందన్నారు.



## సినీ నటి ప్రత్యూష మృతి కేసులో తీర్పు

### సిద్ధార్థరెడ్డి లొంగిపోవాలంటూ సుప్రీంకోర్టు ఆదేశం

- 24 ఏళ్ల తర్వాత ప్రత్యూష మృతి కేసులో తీర్పు
- నాలుగు వారాల్లో లొంగిపోవాలని సిద్ధార్థరెడ్డికి సుప్రీంకోర్టు ఆదేశాలు
- సిద్ధార్థరెడ్డి పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు

ఢిల్లీ,:ప్రముఖ టాలీవుడ్ సినీ నటి ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు తుది తీర్పును వెలువరించింది. రెండు దశాబ్దాలకు పైగా నడుస్తున్న ఈ కేసులో జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం కీలక తీర్పును వెలువరించింది. సిద్ధార్థరెడ్డి పిటిషన్‌ను కొట్టివేస్తూ, నాలు గు వారాల్లో లొంగిపోవాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. సినీ నటి ప్రత్యూష 2002 ఫిబ్రవరి 23న మృతి చెందారు. ఈ కేసులో నిందితుడు సిద్ధార్థరెడ్డికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ తీర్పును సిద్ధార్థరెడ్డి హైకోర్టులో సవాల్ చేయడంతో జైలు శిక్షను రెండేళ్లకు కుదించింది. హైకోర్టు తీర్పును ప్రత్యూష తల్లి సరోజిని సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. మరోవైపు, శిక్షను రద్దు చేయాలని సిద్ధార్థరెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.



## క్యాతన్‌పల్లిలో స్వల్ప ఉద్రిక్తత

### బిఆర్ఎస్, కాంగ్రెస్ బాహాబాహీ పోలీసుల లాఠీఛార్జ్.. పలువురికి గాయాలు

**మంచిర్యాల,తెలంగాణ దిశ :** మంచిర్యాల జిల్లా క్యాత నపల్లిలో మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో ఉ ద్రిక్తత నెలకొంది. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాల యానికి బీఆర్ఎస్, సీపీఐ అభ్యర్థులు భారీ బందోబస్తు తో చేరుకున్నారు. ఎంపీ వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకటస్వామితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులు వచ్చారు. ఈ క్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. అది కాస్త ముదరడంతో ఇరువర్గా లు ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. క్యాతనపల్లి మున్సిపల్ కార్యాల యానికి బిఆర్ఎస్, సిపిఐ అభ్యర్థులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఎంపి వంశీకృష్ణ, మంత్రి వివేక్ వెంకట స్వామితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థులు వచ్చారు. ఈ క్రమంలో బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య వా గ్వాదంజరిగింది. ఘర్షణ రాజుకొని ఇరువర్గాలు ఒక రిపై ఒకరు దాడులు చేసుకున్నారు. దీంతో రంగం లోకి దిగిన పోలీసులు లాఠీ చార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ఘటనలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బిఆర్ఎస్ కౌన్సిలర్లను చైర్మన్ ఎన్నికలో పాల్గొననివ్వకుండా పోలీసులు అక్రమ కేసులు పెట్టి అడ్డుకున్నారు.



## కేటీఆర్ మెడకు.. ఈ ఫార్ములా..!

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ఇన్ని రోజులపాటు ఫోన్ ట్యాపింగ్ కేసును తెరపైకి తీసుకువచ్చి.. కేటీఆర్, హరీష్ రావు, సంతోష్ రావు, కెసిఆర్ వంటి వారిని విచారించింది తెలంగాణ ప్రభుత్వం. మున్సిపల్ ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత.. అవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వచ్చిన తర్వాత.. ఈసారి ప్రభుత్వం మరింత వేగంగా అడుగులు వేయడం మొదలుపెట్టింది. భారత రాష్ట్ర సమితిలో కార్య నిర్వాహక అధ్యక్షుడిగా కొనసాగుతున్న కేటీఆర్ పై మరింత ఒత్తిడి తీసుకురావడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నడుం బిగించారు. కేటీఆర్ పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఫార్ములా ఈ కార్ రేస్ జరిగింది.

అందులో కుంభకోణం జరిగిందని.. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా విదేశీ కంపెనీకి.. తెలంగాణ ప్రభుత్వం నిధులు పంపించిందని.. ఇందులో చీకటి వ్యవహారం దాగి ఉందని ప్రస్తుత రేవంత్ సర్కార్ ఆరోపిస్తోంది. ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో ఇప్పటికే ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను విచారించాలని రాష్ట్ర ప్రభుత్వం కోరిన నేపథ్యంలో.. కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ కేసులో ఏసీబీ మరో రెండు రోజుల్లో ఛార్జ్ షీట్ దాఖలు చేస్తుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే అరవింద్ కుమార్ ను విచారించడానికి కేంద్రం అనుమతి ఇవ్వడం విశేషం. 2023లో హైదరాబాద్ నగరంలో ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహించారు.



## జీవన్ రెడ్డికి కాంగ్రెస్ షాక్..!

**కరీంనగర్,,తెలంగాణ దిశ :**జగిత్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ పీఠం కోసం కాంగ్రెస్ పార్టీలోని రెండు వర్గాలు తీవ్రంగా ప్రయత్నాలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌లు తమ వర్గానికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో కాంగ్రెస్ పెద్దలు రంగంలోకి వారి మధ్య సయోధ్య కుదర్చేందుకు చర్చలు జరిపారు. చివరికి కాంగ్రెస్ అధిష్టానం ఆ పార్టీ సీనియర్ నేత జీవన్ రెడ్డికి బిగ్ షాకిచ్చింది. జగిత్యాల చైర్మన్ పీఠం సంజయ్ వర్గానికే కట్టబెడుతూ నిర్ణయించింది. జగిత్యాల మున్సిపాలిటీలో మొత్తం 50 వార్డులు ఉండగా చైర్‌పర్సన్‌ను ఎన్నుకోవాలంటే కనీసం 25 మంది కౌన్సిలర్ల మద్దతు అవసరం. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ 23 చోట్ల, స్వతంత్రులు 15 చోట్ల గెలుపొందారు. బీజేపీ ఆరు, బీఆర్ఎస్ నాలుగు, ఎంఐఎం రెండు స్థానాలు గెలుచుకుంది. కాంగ్రెస్‌లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వర్గం నుంచి 33 మంది పోటీ చేయగా 14మంది, మాజీ మంత్రి జీవన్ రెడ్డి వర్గం నుంచి 17 మంది పోటీ చేయగా తొమ్మిది మంది విజయం సాధించారు.

# చిన్న పత్రికలను ఎంప్యానల్‌మెంట్ చేయాలని కోరుతూ సమాచార భవన్ ముట్టడి

## సర్కారు వివక్షకు నిరసనగా కదం తొక్కిన కలం కార్మికులు...




హైదరాబాద్, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) : కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న, మధ్య తరహా పత్రికలకు అక్రిడిటేషన్లు ఇవ్వకుండా, ఎంప్యానల్‌మెంట్ చేయకుండా వివక్ష చూపుతున్న ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం ఆయా పత్రికల జర్నలిస్టులు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్ లోని సమాచార పౌర సంబంధాల శాఖ కమీషనర్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) ఇచ్చిన ఛలో సమాచార భవన్ పిలుపు మేరకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన చిన్న, మధ్య తరహా పత్రికల పబ్లిషర్స్, ఎడిటర్లు, పాత్రికేయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీగా వెళ్లిన జర్నలిస్టులు దాదాపు రెండు గంటల పాటు కార్యాలయం ప్రవేశ ద్వారం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు.

ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ సారి 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్ మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్లకు మాత్రమే ఇస్తూ మిగతా పత్రికలకు అన్యాయం చేస్తు న్నారని అన్నారు.

గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్ మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డు లిచ్చేవారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆ పద్దతిని తుంగలో తొక్కి పత్రికలకు ఎంప్యా నల్ మెంట్ ముసుగు తొడిగి, నిబంధనల పేరుతో చిన్న, మధ్య తరహా పత్రికలను పాతాళానికి తొక్కారని మామిడి సోమయ్య ధ్వజమెత్తారు. తెలంగాణ స్వరాష్ట్రంలోనే చిన్న మధ్య తరహా పత్రికలకు, వాటిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ తొలి ప్రభుత్వం జర్నలిస్టులకు చేసిన అన్యాయంపై ఆనాడు గొంతెత్తిన ఈనాటి పాలకులు అధికారంలోకి వచ్చి రెండేండ్లయినా... అనేక పత్రికలను ఎంపానల్ మెంట్ చేయకుండా జర్నలిస్టులకు అన్యాయం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జర్నలిస్టులందరికీ సరైన న్యాయం చేస్తామని నమ్మ బలికిన పాలకులు మీడియా అక్రిడిటేషన్ల విషయంలోనే వివక్ష చూపుతూ చిన్న, మధ్య తరహా పత్రికలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయకుండా రెండేళ్లుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, కనీసం అక్రిడిటేషన్లు ఇవ్వకుండా అణిచి వేస్తున్నారని ధ్వజమెత్తారు. మరోవైపు ఎంప్యానల్ మెంట్ లిస్టులో ఉన్న చాలా పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించి జర్నలిస్టులను ఆందోళనకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సందర్భాన్ని బట్టి దరఖాస్తు చేసుకుంటే అడ్వర్టయిజ్ మెంట్ తో పాటు అక్రిడిటేషన్ ఇచ్చే వారని, ప్రస్తుతం అడ్వర్టయిజ్ మెంట్ సంగతి దేవుడెరుగు గానీ... కనీసం అక్రిడిటేషన్ కార్డు ఇవ్వకపోవడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ వివక్ష కారణంగా స్వరాష్ట్రంలో చిన్న పత్రికల మనుగడ ప్రశ్నార్ధకంగా మారుతుందని, దీని వల్ల ఎంతో మంది సీనియర్ జర్నలిస్టులకు పత్రికల నిర్వహణ భార మవుతుందని అన్నారు. దీనికి తోడు మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఎంప్యానల్ లో ఉన్న పత్రికలను ఆ జాబితా నుంచి తొలగించడం చాలా భాదాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పునరాలోచన చేసి ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్న ప్రతి పత్రికకు అక్రిడిటేషన్ కార్డులు గతంలో మాదిరిగా ఇవ్వాలని మామిడి సోమయ్య డిమాండ్ చేశారు. అదే విధంగా ఆయా పత్రికలకు ఎంప్యానల్‌తో సంబంధం లేకుండా నెలకు కనీసం ఒక అడ్వర్టయిజ్ మెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చిప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, భీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర నాయకులు తన్నీరు శ్రీనివాస్, కె. పాండురంగా రావు,పద్మనాభరావు, యర్రమిల్లి రామారావు, హైదరాబాద్ జిల్లా నాయ కులు వి. రవికుమార్, శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సంతోష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్,నాయకులు జగదీశ్వర్ గుప్తా, డప్పు రామస్వామి,శంకర్,శివకుమార్, సంజీవ్ కుమార్, మంజులారెడ్డి, సౌభాగ్యవతి, సుష్మిత, శివపార్వతి, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, నిజామాబాద్ జిల్లా నేతలు కుంచెం శ్రీనివాస్,పానుగంటి శ్రీనివాస్, యార్వ నరేష్, మహాదేవ్ ప్రసాద్ రాజు, నల్గొండ జిల్లా నాయకులు వెలుతురు యాదయ్య, జీడిమట్ల రవీందర్, నాగయ్య, పరమేష్, లింగస్వామి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఐ అండ్ పీఆర్ జాయింట్ డైరెక్టర్ జగన్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం సమర్పించారు.



# ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికలకూ అక్రిడిటేషన్లు ఇవ్వాలి

### - మంత్రి పొంగులేటిని కలిసిన టీడబ్ల్యూజెఎఫ్ నేతలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :** కేంద్ర ప్రభుత్వ సంస్థ ఆర్ఎన్ఐ, పీఆర్ జీఐ రిజిస్ట్రేషన్ కలిగిన చిన్న,మధ్య తరహా పత్రికలకు అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య రాష్ట్ర సమాచార, పౌరసంబధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరారు. మంగళవారం ఆయన పలువురు ఫెడరేషన్ నాయకులతో కలిసి సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మంత్రితో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత స్వరాష్ట్రంలో గత పదేండ్లు చిన్న, మధ్య తరహా పత్రికల అణచివేత కొనసాగిందని అన్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రభుత్వంలో న్యాయం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మీడియా సంస్థలకు ఈ సారి 44 వేలకు పైగా అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వనున్నట్లు ప్రకటించినప్పటికీ, కేవలం ఎంపానల్ మెంట్ అయిన కొన్ని పత్రికలకు, చానళ్లకు మాత్రమే ఇస్తున్నారని, ఎం ప్యానల్ కాని ఆర్ఎన్ఐ,పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో నడుస్తున్న మిగిలిన పత్రికలకు ఇవ్వకపోవడం బాధాకరమని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎంపానల్మెంట్ తో సంబంధం లేకుండా ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న అన్ని పత్రికలకు ఆయా పత్రికల సర్క్యులేషన్ ఆధారంగా జర్నలిస్టులందరికి అక్రిడిటేషన్ కార్డులిచ్చే వారని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఇవ్వడం లేదని, ఎం ప్యానెల్ మెంట్ అనేది కేవలం ప్రభుత్వ అడ్వర్టయిజ్ మెంట్ లకే అని ఆయన మంత్రికి వివరించారు.ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ గుర్తింపు ఉన్న పత్రికలను ఎంప్యానల్ చేయాలని, అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని మామిడి సోమయ్య మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రింటింగ్ ప్రెస్ కోసం ఒక ఎకరం భూమిని ప్రభుత్వ నామినల్ ధరకు ఇచ్చి ప్రింటింగ్ ప్రెస్ ఏర్పాటుకు రుణ సదుపాయం కల్పించాలని కోరారు.



జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఉన్న జిల్లాలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీలో ప్రయాణించేందుకు ఉచిత బస్ పాస్ ఇవ్వాలని, హెల్త్ కార్డులు, భీమా సౌకర్యం కల్పించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్(టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, నాయకులు హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, కో- కన్వీనర్లు శ్రీనివాస్ గౌడ్, బ్రహ్మం, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పాల్వాయి జానయ్య, హరి ప్రసాద్ తదితరులున్నారు.

## ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య అన్నప్రసాద వితరణ



**నాగారం, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :**నాగారం ఆర్యవైశ్య సంఘం మహిళా మణుల ఆధ్వర్యంలో నెంబర్ 6లో మంగళవారం అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. 140 మంది దాతల సహకారంతో ప్రతి నెల 1000 నుండి 1100 మందికి స్వచ్ఛమైన ఇంటి అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థలదాతతో పాటు వాలంటీర్లను అందిస్తున్న సాయి వీరభద్ర ఫర్నిచర్ అధినేత బంగారం బి. వినాయకుమార్ స్నేహ దంపతులను ఈ సందర్భంగా వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గుండ వెంకన్న, లింగ నాగేందర్, ఉప్పల ప్రసన్న కుమార్, సత్యనారాయణ, లింగ అమరేందర్, పాలవరపు శ్రీనివాస్, గట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అమావాస్య అన్న ప్రసాద వితరణ

### - పేద వృద్ధురాళ్లకు పెన్షన్ల అందజేత



**కుషాయిగూడ, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :**వాసవి మిత్ర మండలి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఈసీఐఎల్ చౌరస్తాలో అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం ప్రతినెల పేద వృద్ధురాళ్లకు రూ. 1000 చొప్పున అందజేస్తున్న పెన్షన్ ను మాలే వరమ్మ, కొండూరి విజయ, తోడుపునూరి ఉమారాణి, పడకంటి కమలమ్మలకు అందజేశారు. ఈ సందర్భంగా వాసవి మిత్రమండలి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పెద్ది నాగరాజు గుప్త, ప్రధాన కార్యదర్శి రెబెల్లి శ్రీనివాస్ గుప్త, కోశాధికారి రాముని తిరుమలేష్ గుప్తా, కార్యనిర్వాహక కార్యదర్శి గంప కృష్ణ గుప్త, ఉపాధ్యక్షులు నంగునూరి అశోక్ గుప్త, తాటి శ్రీనివాస్ గుప్త, కార్యదర్శులు బాచెల్లి నవీన్ గుప్త, అమర కృష్ణ గుప్త, చందా సంతోష్ గుప్తా, కార్యవర్గ సభ్యులు మిర్యాల అరుణ్ కుమార్ గుప్త, ఉప్పల ఆంజనేయులు గుప్త, సభ్యులు ఉప్పల శ్రీనివాసులు గుప్త, బెలిదే బాగువాన్ గుప్త, రవ్వ ఈశ్వరరావు గుప్త, చంద్రగిరి తారకేశ్వర్ గుప్త, కమిశెట్టి రామలింగం గుప్త, పెద్ది నవీన్ గుప్త, రాయల సంతోష్ గుప్త, గజ్జల రమేష్ గుప్త, దిడిగం కైలాసం గుప్త, రాయికంటి ముత్యాల గుప్త, దాచా ప్రసాద్ గుప్త, పెద్ది శ్రీనివాస్ గుప్త, దారం అనిల్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**బోడుప్పల్, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ):**మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం బోడుప్పల్‌లోని ప్రతాప్ సింగారంలోని ఆయన స్వగృ హంలో ఘనంగా నిర్వహి ంచారు. ఈ వేడుకలకు మహిళా కాంగ్రెస్ నాయకురాలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. అనంతరం మహిళా నాయకురాళ్లు పూలమాలలు వేసి శాలువాతో సన్మానించారు. మహిళా కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెరుగు సునీత మాట్లాడుతూ సుధీర్ రెడ్డి నాయకత్వం ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచిందని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు దుర్గా, మేడ్చల్ ఏ బ్లాక్ అధ్యక్షురాలు తాటికాయల కోమలత, దమ్మాయిగూడ డివిజన్ అధ్యక్షురాలు జూపల్లి శోభారాణి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షురాలు సమతా యాదవ్, ఫీర్జాదిగూడ కార్పొరేషన్ రెండవ వార్డు అధ్యక్షురాలు తండా పరమేశ్వరి, గుండ్ల పోచంపల్లి మున్సిపల్ వైస్ ప్రెసిడెంట్ శిల్ప తదితరులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో సుధీర్ రెడ్డి చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. సుధీర్ రెడ్డి సంపూర్ణ ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.



# కాంగ్రెస్ ప్రభుత్వంలో కాలనీల అభివృద్ధికి మహర్దశ

### - కాంగ్రెస్ పార్టీ నేత నెమలి అనిల్ కుమార్





**మల్లాపూర్, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :**బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్‌లోని సాయి గార్డెన్స్ సమీపంలోని శ్రీనివాస కాలనీలో నెమలి అనిల్ కుమార్ మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ పెద్దలతో కలిసి కూర్చొని, వారి సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. కాలనీలోని తాగునీరు, డ్రైనేజీ, రోడ్లు, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక సదుపాయాలపై ప్రజలు వివరించిన సమస్యలను శ్రద్ధగా విని, వాటి పరిష్కారానికి వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా నెమలి అనిల్ కుమార్ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జీ మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో శ్రీనివాస కాలనీలో ఉన్న అన్ని ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని, కాలనీ ప్రజలకు నెమలి అనిల్ కుమార్ హామీ ఇచ్చారు. కాలనీల అభివృద్ధి కోసం నేరుగా ప్రజల మధ్యకు వెళ్లి సమస్యలను తెలుసుకుంటూ, పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం కాంగ్రెస్ పార్టీ ప్రత్యేకత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గోవింద్, వైస్ ప్రెసిడెంట్ ఎండి. లైక్, జాయింట్ సెక్రటరీ ఎండి. ముజఫర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ జి. సురేష్ గౌడ్, పి. కృష్ణ, పి. సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్ రావునగర్ లో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు



**ఏఎస్ రావునగర్, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :**తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత, రాష్ట్ర ప్రదాత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదినం పురస్కరించుకుని మంగళవారం రాధికా చౌరస్తాలో కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కెసిఆర్ చిత్రపటం వద్ద కేకు కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ ఏఎస్ రావునగర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీష సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ పాత్ర అపూర్వమని, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి నాయకుడని కొనియాడారు. సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలకు అండగా నిలిచిన మహానేత అని పేర్కొన్నారు.

భవిష్యత్తులో కూడా ఆయన నాయకత్వంలో తెలంగాణ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, పార్టీ సీనియర్ నాయకులు బండారి నీలం రెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, పెద్దాపురం కుమారస్వామి, స్థానిక నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఇజ్జత్ తీసుకుంటున్న ట్రంప్

2024లో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల తర్వాత డొనాల్డ్ ట్రంప్ మరోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. దీంతో అమెరికన్ల పరిస్థితి పెనం పైనుంచి పొయ్యిలో పడినట్లయింది. పాలన పిచ్చోడి చేతిలోకి చేరింది. ఎప్పుడు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటాడో తెలియడం లేదు. అమెరికా ఫస్ట్ అంటూ వారికి మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తున్నాడు. అమెరికన్ల ఉద్యగాలు భారతీయులు కొట్టేస్తున్నారన్న అక్కసుతో మొదట భారతీయులను ఉద్యోగాల్లోకి తీసుకోవద్దని కంపెనీలకు హుకూం జారీ చేశారు. తాజాగా హెచ్1బీ వీసాల చార్జీలు లక్ష డాలర్లకు పెంచాడు. మరుసటి రోజే ఈ రూల్ కొత్తవారికే అని సవరించాడు. తాజాగా హెచ్1బీ లాటరీ విధానంలోనూ మార్పు చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడు. ఈ కొత్త ప్రతిపాదనలు ఉన్నత నైపుణ్యం ఉన్న విదేశీ నిపుణుల ఎంపికకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు, స్థానిక అమెరికన్ ఉద్యోగులకు మెరుగైన అవకాశాలు కల్పించే లక్ష్యంతో రూపొందుతున్నాయి. ఈ సంస్కరణలు లాటరీ విధానాన్ని సమూలంగా మార్చడం, వేతన స్థాయి ఆధారంగా దరఖాస్తులను వర్గీకరించడం వంటి కీలక అంశాలను కలిగి ఉన్నాయి. డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ప్రస్తుత లాటరీ విధానాన్ని తొలగించి, ఉన్నత నైపుణ్యం గల విదేశీ నిపుణులను ఆకర్షించేందుకు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. ఈ కొత్త విధానం కింద దరఖాస్తుదారుల వేతన స్థాయిని ఆధారంగా చేసుకుని నాలుగు వర్గాలుగా (లెవల్1 నుంచి లెవల్4) విభజించి, ఉన్నత వేతనం పొందే అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ చర్య ద్వారా అమెరికన్ ఉద్యోగులకు పోటీని తగ్గించి, అధిక నైపుణ్యం గల విదేశీయులను మాత్రమే ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్త నిబంధనలు 2026 ఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి వస్తే, హెచ్1బీ ఉద్యోగులకు చెల్లించే వేతన వ్యయాలు గణనీయంగా పెరుగుతాయని డీహెచ్ఎస్ అంచనా వేసింది. 2026లో ఈ వ్యయం 502 మిలియన్ డాలర్లకు చేరుతుందని, ఆ తర్వాత 2027లో 1 బిలియన్ డాలర్లు, 2028లో 1.5 బిలియన్ డాలర్లు, 2029లో 2 బిలియన్ డాలర్లకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ పెరుగుదల అమెరికా ఆర్థిక వ్యవస్థపై, ముఖ్యంగా టెక్నాలజీ, ఇంజనీరింగ్ రంగాలపై గణనీయమైన ప్రభావం చూపనుంది. ఈ సంస్కరణలను 2026 నుంచి అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందుతున్నాయి. అయితే, ఈ మార్పులు అమల్లోకి రావడానికి ముందు ఫెడరల్ రిజిస్ట్రార్ ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించడం, రాజకీయ, ఆర్థిక సవాళ్లను అధిగమించడం అవసరం. ముఖ్యంగా, ఈ సంస్కరణలు అమెరికన్ కంపెనీలు, విదేశీ నిపుణుల ఆకర్షణపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది కీలక చర్చనీయాంశంగా ఉంది. హెచ్1బీ వీసా సంస్కరణలు అమెరికా ఆర్థిక వ్యవస్థలో నైపుణ్యం ఆధారిత ఉద్యోగాలను మెరుగుపరచడం, స్థానిక ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వడం లక్ష్యంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ మార్పులు అమలు చేయడంలో వేతన వ్యయాల పెరుగుదల, కంపెనీలపై ఆర్థిక భారం, విదేశీ నిపుణుల ఆకర్షణలో సమతుల్యతను కాపాడటం కీలకం. ఈ ప్రతిపాదనలు విజయవంతంగా అమలైతే, అమెరికా శ్రామిక శక్తిలో నైపుణ్యం ఆధారిత మార్పులకు బాటలు వేయవచ్చు. మరో వైపు మెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, సెప్టెంబర్ 19, 2025న హెచ్1బీ వీసాలకు ఏడాదికి లక్ష డాలర్ల ఫీజు విధించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. ఇది ముఖ్యంగా టెక్ రంగంలోని భారతీయ ఐటీ కంపెనీలపై దెబ్బ తీసింది. అయితే, 24 గంటల్లోనే వైట్ హౌస్ ప్రకటన విడుదల చేసి, ఈ ఫీజు కేవలం కొత్త అప్లికేషన్లకు మాత్రమే వర్తిస్తుందని, ఇప్పటికే ఉన్న వీసాలు లేదా రెన్యూవల్స్‌కు కాదని వివరించింది. తర్వాత ఒక్కసారి చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. ఈ మార్పు టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) వంటి కంపెనీలు అమెరికాలో ఆధారంగా ఉన్న హెచ్1బీ ప్రోగ్రామ్‌పై ఆధారపడటం వల్ల వచ్చిందని అంచనా. టీసీఎస్ 2025లో 5 వేలకి పైగా హెచ్1బీ వీసాలు పొందింది, ఇది అమెరికన్ టెక్ జాయింట్స్‌తో పోటీ పడుతున్నది. ట్రంప్ హెచ్1బీ వీసా చార్జీల నిర్ణయం తర్వాత, టాటా గ్రూప్‌కు చెందిన ఎయిర్ ఇండియా, 46 బిలియన్ డాలర్ల విలువైన బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్‌ల కొనుగోలు ఒప్పందాన్ని రద్దు చేసింది. ఇది 10 లక్షల మందికి ఉద్యోగాలు సృష్టించేదని అంచనా. రద్దుకు మూడు కారణాలు చూపింది. మొదటిది స్ఫేజూన్ 2025లో జరిగిన బోయింగ్ 787 ప్రమాదం (అహ్మదాబా ద్‌లో 240 మంది మరణాలు) తర్వాత డ్రైమ్‌లైనర్‌ల సురక్షితతపై సందేహాలు పెరిగాయి. రెండోది క్వాలిటీ బోయింగ్‌లో డీఐఈ (డైవర్సిటీ, ఈక్వాలిటీ, ఇంక్లూజన్) పాలసీలు క్వాలిటీని దెబ్బతీస్తున్నాయని టాటా వాదన. మూడోది జియోపాలిటిక్స్ ట్రంప్ 50% టారిఫ్‌లు విధించడం, అమెరికా వ్యాపారం భారత్‌కు లాభదాయకం కాదని. ఇది అమెరికాకు పెద్ద దెబ్బ, ఎందుకంటే ఇతర కంపెనీలు కూడా ఇదే కారణాలు చెప్పి ఒప్పందాలు రద్దు చేయవచ్చు. ఇదే సమయంలో అమెరికాలోని అమెజాన్, గూగుల్, ఆపిల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు హెచ్1బీ మార్పుకు వ్యతిరేకంగా స్పందించాయి. అమెజాన్ 10 వేలకుపైగా హెచ్1బీ వీసాలు పొందిన అగ్రస్థానంలో ఉంది. ఈ కంపెనీలు ఉద్యోగులకు 'సెప్టెంబర్ 21 ముందు అమెరికాకు తిరిగి వచ్చేయండి' అని మెమోలు జారీ చేశాయి, లేకపోతే రీఎంట్రీ డినైల్ అవుతుందని హెచ్చరించాయి. వాటి భారతీయ ఉద్యోగులు దేశం వదిలేసి భారత్‌లోనే జీసీసీ(గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్) పెట్టుకుంటామని హానికర పరిణామాలు హెచ్చరించాయి. ఇది ట్రంప్‌కు దిగిరాక తప్పలేదు, ఎందుకంటే ఈ కంపెనీలు అమెరికా ఎకానమీకు కీలకంట్రంప్‌లు భారత్‌తో వాణిజ్య సంబంధాలు బలోపేతం చేయాలని ఆహ్వానించినప్పటికీ, పీయూష్ గోయల్‌ను పంపకుండా కేంద్రం అతడినే పంపింది. తాత్కాలికంగా భారత్‌కు దెబ్బ తగినప్పటికీ, దీర్ఘకాలంలో అమెరికాకే నష్టం. భారత్ ఏ1ఆపై ఆధారపడకుండా ఆత్మనిర్భర్‌గా మారుతోంది, ఇది ట్రంప్ పునరాలోచనకు కారణం. ఆత్మనిర్భర్ భారత్ చొరవలో భారత్ స్వయం సమృద్ధి వైపు అడుగులు వేస్తోంది. డీఆర్డీవో 'ప్రాజెక్ట్ కుశా' (ఎస్500 లెవెల్ ఎయిర్ డిఫెన్స్) అభివృద్ధి చేస్తోంది, 2028 నాటికి డెప్లాయ్ అవుతుంది. డ్రోన్స్.. భార్గవాస్త్ర (స్వార్మ్ డ్రోన్ న్యూట్రలైజేషన్) 2025లో టెస్ట్ అవ్వగా, డీ4అంటీడ్రోన్ సిస్టమ్ పాకిస్తాన్ కాన్ఫ్లిక్ట్‌లో విజయవంతమైంది. యాంటీడ్రోన్ టెక్, లేజర్ వెపన్స్ టీపీసీఆర్2025లో భాగం. సబ్‌మెరైన్స్: 80% ఇండిజినస్ టెక్‌తో అభివృద్ధి. ఎలక్ట్రో మాగ్నటిక్ ఏర్‌క్రాఫ్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఈఎంఏఎల్) యుద్ధ నౌకలకు. శాటిలైట్ టెక్‌తో అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తోంది. ఇవి అమెరికా ఆంక్షలు విధిస్తే అమెరికాకే తీవ్ర నష్టం కలిగిస్తాయి. ట్రంప్ హెచ్1బీ మార్పు భారతఅమెరికా సంబంధాల్లో ఒక మలుపు తిరిగింది, కానీ ఇది భారత్ ఆత్మనిర్భరతను వేగవంతం చేస్తోంది. టాటా రద్దుటెక్ హెచ్చరికలు అమెరికా ఎకానమీకు హెచ్చరిక. దీర్ఘకాలంలో, భారత్ స్వయం సమద్ధి ద్వారా అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తుంది, ట్రంప్ పునరాలోచనలకు దారి తీస్తుంది.

# విద్యార్థులు క్రమ-శిక్షణతో ఉన్నత -శిఖరాలు అధిరోహించాలి

**- ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నుల పంపిణీ**

**- మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**





**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 281 డివిజన్ రంగారెడ్డి నగర (గాంధీనగర్) లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక కాంగ్రెస్ నాయకుడు షాకీర్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులందరూ క్రమశిక్షణతో పాటు విద్యను సక్రమంగా నేర్చుకొని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, అదేవిధంగా పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్యను తెలుసుకొని పాఠశాల ఉపాధ్యాయులను అభినందించారు, విద్యార్థుల అభ్యున్నతికి ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని అదే విధంగా పాఠశాలలో ఉన్న మౌలిక వసతులు, విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యార్థులకు ఉచిత పరీక్ష ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేసిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు షాకీర్ ను శ్రీశైలం గౌడ్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తో పాటు ఉపాధ్యాయ బృందం, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


# అమావాస్య అన్న ప్రసాద వితరణ స్ఫూర్తిదాయకం





**కుషాయిగూడ, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోచమ్మ దేవాలయంలో ప్రతి నెల అమావాస్య రోజు నిర్వహించే అన్నదాన కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. శ్రీ మారుతి మిత్ర మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమం స్థానికులకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సమాజ సేవే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మారుతి మిత్ర మండలి అధ్యక్షులు గురుమంచి అశోక్ చారి, ప్రధాన కార్యదర్శి హనుమంతు వరగంటి, కోశాధికారి మచ్చ బాబుగౌడ్, సభ్యులు కాసుల సురేష్ గౌడ్, గురుమంచి వేణుగోపాల్ చారి, ఏ సతీష, శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ సంకూరి శ్రీనివాస్ గౌడ్, అమరచారి, ఆంజనేయులు యాదవ్, రఘు గౌడ్, బిజెపి నాయకులు రవీందర్ రెడ్డి, గణేష్ ముదిరాజ్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా నేడు నాగారంలో విద్యుత్ నిలిపివేత




**నాగారం, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :** చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా 18వ తేదీ బుధవారం రెండు 11 కె.వి ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు నాగారం సెక్షన్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎ. వంశీ కృష్ణ తెలిపారు. ఈ కారణంగా 33/11 కె.వి అహ్మద్‌గూడ (ఆర్‌జీకే) సబ్‌స్టేషన్, 11 కె.వి "భారతరత్న ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఈడెన్ గార్డెన్, ఆర్‌జీకే వై-జంక్షన్, ఎన్‌జీఆర్ కాలనీ, వీఆర్ఆర్ ఫేజ్ 1 అండ్ 2, ఇందిరమ్మ కాలనీ, కెఎల్ఆర్ వాటర్ ప్లాంట్ వెనుక వైపు, వీఆర్ఆర్ హోమ్స్, పద్మజ ఎన్‌క్లేవ్, సెయింట్ ఆండ్రూ స్కూల్, లక్ష్మీ గణపతి కాలనీ, సాయి శ్రీనివాస్ కాలనీ, బాలాజీ నగర్, పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ పరిధిలో సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అదే విధంగా 33/11 కె.వి చక్రిపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11 కె.వి బాబు రెడ్డి నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ఈ కారణంగా శిల్పా నగర్, మోడి అపార్ట్‌మెంట్, లావణ్య ఎన్‌క్లేవ్, ప్రగతి ఎన్‌క్లేవ్, చక్రదర ఎన్‌క్లేవ్, బాబు రెడ్డి కాలనీ, లోటస్ కాలనీ, వికాస్ నగర్, లక్ష్మీ నగర్ లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అవసరమైన పనులు పూర్తైన వెంటనే విద్యుత్ సరఫరా పునరుద్ధరించ బడుతుందని ఆయన తెలిపారు.



## సెరినిటీ విద్యార్థినికి ప్రతిభా రత్న పురస్కారం

**నాగారం, ఫిబ్రవరి 17, (తెలంగాణ దిశ) :** నాగారం సెరినిటీ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతున్న పటేల్ ఆరాధ్యకు ప్రతిభారత్న పురస్కారం లభించింది. నవ తెలంగాణ దిన పత్రిక రిపోర్టర్ పటేల్ నర్సింహా కూతురు హిందీ విభాగంలో ప్రతిభా రత్న పురస్కారాన్ని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ చేతుల మీదుగా స్వీకరించింది. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని ప్రతిభను అభినందిస్తూ పురస్కారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చిరంజీవి ఆరాధ్యను పాఠశాల కార్యదర్శి నోముల వసంత, కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డిల తోపాటు పలువురు అభినందించారు.

# వీసా కలకలం..!

విదేశాలకు చెందిన నిపుణులకు అమెరికా జారీ చేసే హెచ్1బి వీసా ఫీజును ఎకాయికిన లక్ష డాలర్లకు (రూ.88 లక్షలు) పెంచుతూ ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయం ప్రపంచంలో పెను సంచలనం రేపగా, ఆ మర్నాడే నష్ట నివారణా చర్యగా పెంచిన రుసుం కొత్త దరఖాస్తులకు మాత్రమేనని, ఒకేసారి చెల్లించేదని యుఎస్ సిటిజన్‌షిప్ అండ్ ఇమ్మిగ్రేషన్ సర్వీసెస్, వైట్ హౌస్ వేర్వేరుగా వివరణలిచ్చాయి. స్థానిక అమెరికన్లకే ఉద్యోగాలనే కుహనా జాతీయ వాదాన్ని ప్రజల్లో రేగ్గొట్టి అధికారంలోకొచ్చిన ట్రంప్, వచ్చింది మొదలు ప్రతీకార, కక్ష పూరిత, ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం చూస్తున్నదే. ప్రస్తుత హెచ్1బి వీసాల ఫీజు పెంపు ఆ కోవలోకే వస్తుంది. ఇప్పటి వరకు సదరు వీసాకయ్యే ఫీజు 2 వేల డాలర్ల నుంచి 5 వేల డాలర్ల వరకు ఉంది. ఒకేసారి లక్ష డాలర్లకు పెంచడం వలన అమెరికాలో విదేశీ నిపుణులపై ఆధారపడ్డ కంపెనీలు అనివార్యంగా తమ దగ్గర పని చేస్తున్న వారిని ఇంటికి సాగనంపే పనైనా చేయాలి. లేదంటే నిర్ణయించిన ఫీజునైనా చెల్లించాలి. అదీ కాకపోతే అమెరికన్లను ఉద్యోగానికి పెట్టుకోవాలి. దీని వలన అమెరికా కంపెనీలపై పడే అదనపు భారం 14 బిలియన్ డాలర్లు (రూ. 1.23 లక్షల కోట్లు) అని అంచనా. ఆ భారాన్ని కంపెనీలు మోయకుంటే అమెరికాలో ఉద్యోగం సంపాదించి నాలుగు రాళ్లు వెనకేసుకోవాలని కలలు కనే భారత్, ఇతర దేశాల యువత కలలు చెదిరిపోతాయి. వాస్తవానికి విదేశాల్లోని నిపుణులను తక్కువ వేతనాలపై నియమించుకొని అక్కడి కంపెనీలు దోపిడీ చేసుకొనేందుకు వీలుగా అమెరికా హెచ్1బి వీసాలను ప్రవేశపెట్టింది. అమెజాన్, మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా వంటి సంస్థలు బాగా లబ్ధి పొందాయి కూడా. కాగా విదేశాల నుంచి తమ దేశానికి వస్తున్న వారు తమ ఉద్యోగాలను, ఉపాధిని కబ్జా చేసి, తమకు దక్కాల్సిన అవకాశాలను తన్నుకుపోతున్నారని కొన్నేళ్లుగా అమెరికన్లలో అసంతృప్తి నెలకొంది. దాన్ని ట్రంప్ ఎన్నికల్లో రాజకీయంగా క్యాష్ చేసుకున్నారు. యువతకు ఇచ్చిన హామీ అమలులో భాగంగా హెచ్1బి వీసాల ఫీజు భారీగా పెంచి తద్వారా స్థానిక యువతకు ఉద్యోగాలిచ్చి సంతృప్తి పర్చాలన్నది ట్రంప్ పన్నాగం. ఇదొక్కటే హెచ్1బి వీసాల రుసుం పెంపునకు కారణం కాదు. తన వాణిజ్య ప్రయోజనాల కోసం కూడా. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన అమెరికాను తాత్కాలికంగానైనా బయట పడేసేందుకు ఇటువంటి దుర్మార్గపు దారులు ఎంచుకున్నారు. దానితోపాటు తన దారికి రాని దేశాలపై ఒత్తిడి పెంచడానికి, బలవంతపెట్టి తన దారికి తెచ్చుకోడానికి, లొంగదీసుకునే వ్యూహం సైతం ఇమిడి ఉంది. ఇప్పటికే అమెరికాలోకి వచ్చే వస్తువుల దిగుమతులపై కొన్ని రెట్ల సుంకాల విధింపు చూస్తున్నదే. కొందరికి కొన్ని సడలింపులు, కాల పరిమితులు ఇచ్చినా అంతిమంగా పలు దేశాలపై తన పెత్తనాన్ని బిగించేందుకు, తనను సవాల్ చేస్తున్న చైనా, ఇతర దేశాలపై వాణిజ్య యుద్ధం ప్రకటించి ఇబ్బంది పెట్టడానికి ట్రంప్ తన అమ్ములపొదిలో నుంచి ఒక్కొక్కటిగా 'ఆయుధాల'ను ప్రయోగిస్తున్నారన్నది అసలు సిసలైన వాస్తవం.

# పరిశోధనా రంగానికి ప్రమాద ఘంటికలు..!

ఈ మాట నమ్మశక్యం గానిది. కారణం పరిశోధన లేని వైజ్ఞానిక పురోగతి లేదు. వైజ్ఞానిక అభివృద్ధి లేని సమాజ పురోగమనమూ లేదు. ఈ రంగంలో పోటీపడి ముందు నిలబడలేని దేశాలు ఎంత సంపద,ఎంత సంస్కృతి, ఎంత చరిత్రవున్నా ముందుకుపోలేవు. శాస్త్ర సాంకేతికాభివృద్ధి పైనే ఆధునిక ప్రపంచం నడుస్తోంది. అమెరికా ప్రపంచాధిపత్యం కూడా దీని వల్లనే సాగుతోంది. కానీ ఆశ్చర్యంగా అమెరికా తన పరిశోధనా కార్యక్రమాలకు కత్తెర వేస్తోందట. ఫెడరల్ సైంటిస్టులను ఇంటికి పంపుతున్నారట. జాతీయ ఆరోగ్య సంస్థకు (ఎన్.హెచ్.ఐ) ఏకంగా ఈ సంవత్సరం 8 బిలియన్ డాలర్లు, వచ్చే ఏడు 18 బిలియన్ డాలర్లు కోత పెడుతున్నారట. జాతీయ సైన్సు ఫెడరేషన్ బడ్జెట్లో 5బిలియన్ డాలర్లు తగ్గించేశారట. నాసాకు సైతం 25 శాతం నిధుల కోత పడిందట. ఇక విశ్వవిద్యాలయాల సంగతి సరేసరి. "మీ నిధులు మీరు సమకూర్చుకోండి. దాతల్ని వెతుక్కోండి. మీ పరిశోధనలు సాగించుకోండి" అని ఫెడరల్ ప్రభుత్వం తేల్చి చెప్పేస్తోందట. ఒక్క ఆయుధాల పరిశోధనే దీనికి మినహాయింపు! దీంతో శాస్త్రవేత్తలు అమెరికా నుంచి వలస కట్టేందుకు సిద్ధమవుతు న్నారు. 'నేచర్ కెరీర్స్' కథనం ప్రకారం ఏకంగా 32 శాతం యూరపు బాట పడతామంటున్నారు. 'నేచర్ పోల్'లో పాల్గొన్న వారిలో 72 శాతం అగ్ర రాజ్యానికి వీడ్కోలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు.

ఇక యూరపులో చూస్తే అక్కడా నిధులు లేవు. ఎప్పుడూ ఒడిదుడుకులు. జీతాలు తక్కువ. శాస్త్రవేత్తలు తమ పరిశోధనను వదిలేసుకుని ఉన్న ఫళాన ఎక్కడికో వెళ్లిపోలేరు. ఎంత చెడ్డా ఇప్పటికీ అమెరికాదే విజ్ఞానాధిపత్యం గాబట్టి సీనియర్లు అక్కడే ఎలాగో సర్దుకుపోదామనుకుంటున్నారు! ఒకప్పుడు సింగపూర్ మంచి జీతాలిచ్చి, ఉత్తమ వసతులు కల్పించి, గొప్ప దార్శనికతతో శాస్త్రవేత్తల్ని ఆకర్షించింది. అక్కడి మంచి స్కూళ్లు, ఆరోగ్య వ్యవస్థలు, భద్రత, రవాణా, స్వచ్ఛ వాతావరణం కూడా దీనికి తోడ్పడ్డాయి. జర్మనీ నుంచి 1930లలో వందలాది వైజ్ఞానికులు అమెరికా వచ్చారు. కానీ అప్పటి కారణం వేరు. అప్పుడక్కడ వారికి భద్రత లేదు. ప్రస్తుతం కృత్రిమ మేధ, బయో టెక్నాలజీ, సెమీ కండక్టర్స్, అంతరిక్షం, క్వాంటం రంగాల్లో ఎవరిది ఆధిక్యమో వారిదే ప్రపంచాధిపత్యం. దీన్ని "గ్లోబల్ టెక్ పోటీ" అంటున్నారు. ఈ పరుగులో 84.3. పాయింట్లతో అమెరికా అగ్ర భాగాన వుంది. చైనా 65.6 పాయింట్లతో దాని వెంట పరుగిడుతోంది.

యూరపు మూడో స్థానంతో సరిపెట్టుకుంది. మిగిలినవి వాటి దరిదాపుల్లో లేవు. మన దేశం 15.2 పాయింట్లతో పదో స్థానంలో వుంటే మనకన్నా రష్యా, కెనడా, ఆస్ట్రేలియా, ఇటలీ, స్పెయిన్లు వెనకబడ్డం విశేషం. "అలాంటప్పుడు అమెరికా యూరపుల నుంచి శాస్త్రవేత్తలు మన దేశానికి వలస వస్తారా" అంటే అలా ఏమీ కనపడ్డం లేదంటారు నోబెల్ అవార్డు గ్రహీత రామకృష్ణన్. కారణం అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా సంస్థలు మనకు తక్కువ. మన ఐఐఎస్సి, ఎన్‌సిబిఎస్, టిఐఎఫ్ఆర్, ఐఐఎస్ఇఆర్, ఐఐటి లు లాంటివి ఒక్కొక్కటి ఒకటి రెండు రంగాల్లో అగ్ర భాగాన వుంటే వుండొచ్చు గానీ మొత్తంగా సంస్థలుగా చూస్తే వాటి నాణ్యత ప్రపంచంతో పోటీ పడగలది కాదు. దీర్ఘకాలిక బేసిక్ రీసెర్చ్‌కి అవకాశాలు వుంటేనే అమెరికా నుంచి శాస్త్రవేత్తలు తరలి వస్తారు. ఇందులో మనం అమెరికా చైనా, యూరపులతో తూగలేకున్నాం. ఇక మొదటి 100 అత్యున్నత విశ్వవిద్యాలయాల్లో మనది ఒక్కటీ లేదు. ఇక నిధుల దగ్గరకు వస్తే పరిశోధనా రంగానికి మనం వెచ్చిస్తున్నది జిడిపి లో కేవలం 0.7 శాతం. చైనా వ్యయంతో పోలిస్తే ఇది మూడో వంతు కూడా లేదు. సివిల్ పరిశోధనల్లో ఇజ్రాయిల్ 6.30 శాతం, దక్షిణ కొరియా 4.9 శాతం, జపాన్ 3.3 శాతం, అమెరికా 3.46 శాతం తమ జిడిపి లలో ఖర్చు చేస్తుంటే మనం ఎక్కడో వుండిపొయ్యాం! రామకృష్ణన్ అంతటితో ఆగక మన దేశ పరిశోధనా రంగానికి మౌలిక సదుపాయాలు, నిధులు లేకపోవడంతో పాటు దీర్ఘకాలిక దృక్పథం కూడా లేదంటారు. "ఇచ్చే నిధులు సకాలంలో ఇవ్వరని, స్కాలర్‌షిప్ లు ఎంత కాలానికీ రావని, ఎప్పుడు ఏ విధానాలు వస్తాయో తెలియవని, ప్రోత్సాహాలు ఇచ్చే సంప్రదాయం తక్కువని, రాజకీయాలు ఎక్కువ" అని ఆయన చెప్పుకొస్తారు.

జాతీయ పరిశోధనా ఫౌండేషన్‌కు (ఎన్.ఆర్.ఎఫ్) ఆర్భాటంగా 2011లో 50 వేల కోట్లు కేటాయించి, ఐదేళ్లలో కేవలం 14 వేల కోట్లిచ్చి, మిగిలినవి దాతల నుంచి సమీకరించుకోవాలన్న చరిత్ర మనది! ప్రైవేట్ పారిశ్రామికవేత్తలకు తక్షణ లాభాలపై ఉన్న మోజు దీర్ఘకాలిక పరిశోధనా రంగంపై ఎప్పుడూ లేని దేశం మనది! అమెరికా పరిస్థితి దీనికి భిన్నం అంటారాయన. కానీ మన దేశ శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి సైన్సు పత్రాల ప్రచురణలో మనం 2029 నాటికి అమెరికాను అధిగమిస్తున్నామంటున్నారు. ఆయన లెక్క ప్రకారం ప్రస్తుతం (2024) చైనా 8,98,949, అమెరికా 4,57,335 భారత్ 2,07,390 లతో మొదటి మూడు వరుసల్లో వున్నాయి. ప్రపంచ అత్యున్నత శాస్త్రవేత్తల్లో మనవారు 5321 మంది (జపాన్ వారు 5608, జర్మనీ వారు 10,420). కానీ సమస్య ఎక్కడ వస్తోందంటే మన పత్రాలు, పి.హెచ్.డిలు నాసిరకమైనవి. హైదరాబాదులోని ఒఎమ్ఐసిఎస్ గ్రూపునకు అమెరికా నైన్త్ సర్క్యూట్ కోర్టు 50 బిలియన్ డాలర్లు అపరాధం విధించింది. కారణం ఈ గ్రూపు ఏకాఎకి 69,000 పత్రాలు ప్రచురించింది. అన్నీ బోగస్‌వి, దండగ మారినవి. ప్రపంచంలోని ఫేక్ జర్నల్సులో 62 శాతం ఇండియాలోనే వున్నాయం టున్నారు. కనీసం 10 శాతం పి.హెచ్.డి ల సంగతీ ఇంతే! "దీర్ఘకాలిక విధానాలు లేకపోవడం, సైన్సును రాజకీయం చేయడం, అధికారుల పెత్తనం, కాలుష్యభరిత నగరాలూ ఇలా ఎన్ని లోపాలున్నా భారతీయ సైంటిస్టుల, మరీ మన యువ వైజ్ఞానికుల కృషి చాలా గొప్పది! ఉష్ణ మండల వ్యాధుల మీదా, జీవావరణం మీదా మనవాళ్ల కృషి ప్రపంచంలో ఎవ్వరికి తీసి పోదు" అంటారు రామకృష్ణన్. దీన్ని మారుతున్న కాలంలో నూ మన దేశం నిలబెట్టుకోగలదా? అగ్రరాజ్యం పరిశోధనా రంగంలో నూ ప్రపంచాన్ని అస్తవ్యస్తం చేస్తుందా? పరిశోధనలు మందగించాక ప్రపంచ గమనం ఎలా వుంటుంది? ఇవన్నీ ప్రశ్నలు.

# అన్నదాత సేద్యానికి అడ్డంకులు?

**కరీంనగర్,తెలంగాణ దిశ :** కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఎస్సారెస్పీ డి–94 కాలువ ఆయకట్టు రైతులు వానకాలం, యాసంగి పంటలకు సరైన నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వలో నాచు పేరుకుపోవడంతో నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. దీంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు వాపోతున్నారు. నాలుగేళ్లుగా ఇదే సమస్య ఉత్పన్నమవుతోందని చెబుతున్నారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ నుంచి వచ్చే డి–94 కాలువ రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి మీదుగా వెళ్తోంది. కరీంనగర్ గ్రామీణ మండల పరిధిలో 5,293 ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తోంది. అయితే రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి వద్ద మురుగు నీరు నేరుగా ఈ కాల్వలోకి చేరుతోంది. దీంతో పంటలు దెబ్బతింటున్నాయి. పైపెచ్చు కాల్వలో నాచు పేరుకుపోయి నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి. ఎక్కువమోతాదులో నీటిని విడుదల చేస్తే సీతారాంపూర్, రేకుర్తి వద్ద కాల్వకట్టలు తెగిపోతున్నాయి. రైతులుఎస్సారెస్పీ అధికారులకు మొరపెట్టు కున్నా నగరపాలక సంస్థ తీరుతో సమస్య పరిష్కారం కనుచూ పుమేరలో కానరావటం లేదు. ప్రస్తుత వానకాలంలో కాల్వనీటి ఆధారంగా, వర్షాధా రంగా పలు గ్రామాల్లో వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు వేశారు. బావులు, బోర్లు లేని పంటలు ఎడే పరిస్థితి పలు గ్రామాల్లో నెలకొంది. గతంలో కాల్వ నీటిని పరిశీలించిన ఎస్సారెస్పీ అధికారులు నగరపాలక సంస్థ మురుగు నీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడుదల చేయడంపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. అధికారులు నగరపాలక సంస్థ అధికారులతో మాట్లాడి సమస్య తాత్కాలిక పరిష్కారం కోసం కాల్వలో పేరుకుపోయిన నాచును తొలగించాలని



సూచించారు.నాచును తొలగించటా నికి నగర పాలక సంస్థ టెండర్లు పిలిచింది. రూ.4.85 లక్షలతో వ్యర్థాల తొలగింపు పనులు ప్రారంభించారు. వేరేశాఖ పనులను నగరపాలక సంస్థ నిబంధనలకు విరుద్ధంగా ఎలా చేస్తుందని విమర్శలు రావటంతో ప్రారంభించిన మరుసటి రోజే టెండర్ రద్దు చేసుకొని పనులను నిలిపివేశారు. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నగరపాలక సంస్థ మురుగునీటిని ఎస్సారెస్పీ కాలువలోకి విడవడం, వ్యర్థాలు తొలగిస్తామని చెప్పి మళ్లీ రద్దు చేసుకోవటంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నగర పాలక సంస్థ కాల్వలో వ్యర్థాలు తొలగించటానికి టెండర్లు పిలిచి పనులు ప్రారం భించారు. మరుసటి రోజే టెండరు రద్దు చేసుకున్నట్లు తెలిసింది. కాలువ లోకి మురుగు నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పంటలకు సక్రమంగా నీరందటం లేదు.

# ఆహారభద్రతపై ఆశలు



**పెద్దపల్లి,తెలంగాణ దిశ :** ప్రజాప్రతినిధుల అభిప్రాయం తీసుకుంటాం. వచ్చే నెల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తాం. – మంత్రి వర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు ఉత్తమ్, పొంగులేటి వ్యాఖ్యలు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకానికి రేషన్‌కార్డు కొలమానం చేశారు. రేషన్‌కార్డు లేకపోవడంతో అభివృద్ధి ఫలాలకు అర్హులైన పేదలు దూరమవుతున్నారు. ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు మిథ్యగా మారింది. కొత్త రేషన్‌కార్డుల జారీపై మంత్రివర్గ ఉపసంఘం స్పష్టత ఇచ్చింది. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొ నడంతో పేద వర్గాల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మంత్రి వర్గ ఉపసంఘంలో కొత్త రేషన్‌కార్డుల విధి విధానాల కూర్పు తుది దశకు చేరింది. పరిమితికి లోబడి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేపట్టారు. కొత్త రేషన్‌కార్డు క్యూఆర్ కోడ్/మైక్రో చిప్/బార్ కోడ్‌తో కూడిన స్మార్ట్ కార్డు ఉంటుంది. ఆదాయ, ఇతరత్రా అర్హతలపై చర్చలు కొనసాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా కొత్తగా రేషన్‌కార్డుల మంజూరు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో దరఖాస్తులు స్వీకరించినా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. గత కొద్ది రోజులుగా ఉపసంఘం పలు మార్లు భేటీ అయ్యింది. మార్గదర్శకాలపై కూలంకషంగా చర్చించారు. ఈనెల 19న ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు తీసుకుని 21న మరోసారి సమావేశం చేపట్టనున్నారు. వచ్చే నెలలో కొత్తగా దరఖాస్తులు స్వీకరించి వడబోత చేపట్టనున్నారు. ఉమ్మడి జిల్లాలో 12,411 పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయి. ఎట్టకేలకు లబ్ధిదారుల నిరీక్షణకు తెర పడనుంది. రేషన్‌కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి నెలకు ఆరు నెలల బియ్యం సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 28 లక్షల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రస్తుతం చాలా మం ది దొడ్డు బియ్యాన్ని తినడంలేదు. పలువురు బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దళారులు బియ్యాన్ని కొనుగోలు చేసి పొరుగు రాష్ట్రాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

# కరుణించిన కాలం.. ఉబికివచ్చిన జలం

**కరీంనగర్,తెలంగాణ దిశ :**వానాకాలం ఆరంభంలో ఆశించిన వర్షాలు కురవక అన్నదా తలు ఆందోళనకు గురయ్యారు. ఈసారి సాధారణం కంటే తక్కువగానే కురుస్తాయోమోనని ఆవేదన చెందుతున్న తరుణంలో కాలం కరుణించింది. జులై, సెప్టెంబరు నెలల్లో దంచికొట్టిన వానలతో సాధా రణం కంటే అధిక వర్షపాతం నమోదైంది. ఈ సారి జిల్లాలో 37 శాతం అధికంగా వర్షం కురిసింది. భూగర్భ జలాలు పైకి ఉబికివ స్తున్నాయి. గత మూడు నెలల్లో నీటిమట్టం తగ్గినప్పటికీ సెప్టెంబరులో పెరగడంతో యాసంగి పంటల సాగు అవసరాలకు భరోసా కలిగింది. ఈ ఏడాది జులైలో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు కురవడంతో జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లోకి నీరు చేరి వాగులు ఉప్పొంగాయి. చెరువుల మత్తళ్లు దూకాయి. వరద కాలువలో నీటి ప్రవాహం కొనసాగుతోంది. ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువ మానేరు జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జిల్లాలో నాలుగు నెలల్లో కలిపి 748.9 మి.మీ సాధారణం కాగా 1025 మి.మీ వర్షం కురి సింది. ఈ వానాకాలంలో 3.34 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. జలాశయాలన్నీ నిండుగా నీరుండడంతో ఆయకట్టు ప్రాంతమైన జిల్లాలో భూగర్భ జలాలు



పైకివచ్చాయి. పంటలకు సమాంతరంగా వ్యవసాయ బావుల నుంచి నీరు జారుతోంది. జిల్లాలో ప్రతి నెలా 33 ఫిజోమీటర్ల ద్వారా నీటి లెక్కలు తీస్తున్నారు. జిల్లావ్యాప్తంగా 3.31 మీటర్ల లోతుకు నీటి మట్టం ఉబికివచ్చింది. గతేడాది సెప్టెంబరు నెలలో 3.40 మీటర్ల లోతులో నీరుంది. అత్యల్పం గా మానకొండూరు మండలంలో 1.36 మీటర్ల లోతులో నీరుండగా అత్యధికంగా గంగాధర మండలంలో 7.27 మీటర్ల లోతులో ఉంది. గత నాలుగు నెలల గణాంకాలు పరిశీలిస్తే భూగర్భ జలమట్టం రెట్టింపు స్థాయికి పెరిగింది.

# మిల్లుల్లో రేషన్ బియ్యం దందా!

## చోద్యం చూస్తున్న అధికారులు?



**వేములవాడ,తెలంగాణ దిశ :** పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. కొంత మంది అక్రమార్కులు రైస్ మిల్లులు కేంద్రంగా ఈ దందాను కొనసాగిస్తున్నారు. వేములవాడ పట్టణం పరిసరాలు, గ్రామీణ మండలం మర్రిపల్లి ప్రాంతంలోని కొన్ని మిల్లుల నిర్వాహకులు రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంత మంది గ్రామాల్లో తిరుగుతూ సేకరించిన వాటిని మిల్లర్లకు విక్రయిస్తున్నారు. వీరి వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసిన వ్యాపారులు ఇతరులకు కిలో రూ.20 నుంచి రూ.25లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ ఏ శాఖ అధికారులు మిల్లులను తనిఖీ చేసి ఈ అక్రమాలను అరికట్టిన దాఖలాలు లేవు. దీంతో ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా కొనసాగుతోంది. రైస్ మిల్లులు, రేషన్ దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాల్సిన పౌరసరఫరాల శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెడుతున్నారు. దీంతో పలు రైస్ మిల్లుల్లో ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతుందన్న ఆరోపణలున్నాయి. ఒక వేళ తనిఖీ చేసినా పట్టు బడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఇదంతా అధికారులకు తెలిసినప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. ఇటీవల కొందరు ఫిర్యాదు చేయడంతో వేములవాడ పట్టణ శివారులోని ఓ రైస్ మిల్లులో జిల్లా పౌరసరఫరాల అధికారులు తనిఖీలు నిర్వహించి కేసు నమోదు చేశారు. అయినప్పటికీ ఈ తతంగం కొనసాగు తుందన్న ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

# ఆలయ అభివృద్ధి దిశగా అడుగులు

**సిరిసిల్ల,తెలంగాణ దిశ :**దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజన్న ఆలయాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు రానున్నా యి. ప్రసాద్ (తీర్థయాత్రల పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వారసత్వ వృద్ధి) పథకంలో వేములవాడ రాజన్న ఆలయాన్ని చేర్చనున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, ఎంపీ బండి సంజయ్ ఈ ప్రతిపాదనలను ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో తుది నిర్ణయం తీసుకుని అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ పథకం కింద ఆలయ పరిసరాలను ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయడంతోపాటు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తారు. దీనికి ముందు వేములవాడ పురపాలిక మాస్టర్ ప్లాన్–2050 అమలు కావాలి. రెండేళ్ల క్రితమే ప్రారంభించిన ఈ ప్రక్రియ డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌కు ముందే నిలిచిపోయింది. రాజన్న ఆలయం, వేములవాడ పట్టణం అభివృద్ధి రెండూ ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్న అంశాలు. దీనికోసం ఏర్పాటు చేసిన వీటీఏడీఏతో ఆలయ విస్తరణ, అభివృద్ధి, పర్యాటకంగా తీర్చిదిద్దాల్సిన



వాటిపై ఇప్పటికే ప్రణాళికలు రూపొందిం చారు. ఇది పూర్తిస్థాయిలో అమలు కావాలంటే మాస్టర్‌ప్లాన్ ప్రధానం. ఢిల్లీకి చెందిన ప్రైవేటు ఏజెన్సీకి సర్వే బాధ్యతలు అప్పగించారు. వీరు డిసెంబరు నెలాఖరులోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. పురపాలిక పరిధిలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న ప్రాంతాల్లో నివాస, వాణిజ్య జోన్‌లుగా ఏర్పాటు చేయనున్నారు.

# కూపన్‌లు, లక్కీ డ్రాలతో నయా దందా..?

**సిరిసిల్ల,తెలంగాణ దిశ :**వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు. ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు. జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకేసారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై



కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు. రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొన్ని నెలలకు సంస్థ నిర్వాహకులు, వారి కింద పని చేసేవారు గ్రామం విడిచి వెళ్లారు. రూ.లక్షల్లో డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమంటూ మధ్యవర్తులను ఆశ్రయించారు. వారు కూడా చేతులెత్తేయడంతో పలువురు ఆత్మహత్యకు యత్నించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.


# ఆటుపోట్లను తట్టుకుంటూ వరి కోతలు షురూ!



ఎల్లారెడ్డిపేట:వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబా టులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు. జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది. 258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు. జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమశాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు.

# బిల్లులు రావు..భవనాలు పూర్తికావు!

**మెట్‌పల్లి,తెలంగాణ దిశ :**మెట్‌పల్లి మండలం కేసీఆర్ తండాలో నిర్మిస్తున్న గ్రామ పం చాయతీ భవనమిది. తలుపుల బిగింపు, ఫ్లోరింగ్, రంగులు వేయడం తది తర పనులు మిగిలిపోయాయి. బిల్లులు రాకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని తెలుస్తోంది. నూతనంగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ కార్యాలయం గతంలో పాఠశాల భవనంలో కొనసాగగా ప్రస్తుతం మహిళా సంఘం భవనంలోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. సమా వేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడానికి అటు అధికారులు ఇటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలు కరవయ్యాయి. సమస్యల పరిష్కారం, సమావేశాలు, రికార్డుల నిర్వహణ, అభివృద్ధి పనులు ఇలా అన్నీ ఇక్కడి నుంచే నిర్వహించాల్సి ఉంటుంది. పాలనకు కీలకమైన గ్రామ పంచాయతీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా పలుచోట్ల పనులు ముందుకు సాగడం లేదు. చేసిన పనులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో వేగం తగ్గింది. మరికొన్ని చోట్ల ఇతర కారణాలతో పను లు మొదలవలేదు. జిల్లాలో కొత్త పంచాయతీలతో పాటు భవనాలు శిథిలావస్థకు చేరిన చోట పాలనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అద్దె, కమ్యూనిటీ, పాఠశాల, మహిళా సంఘాల భవనాల్లో కొనసాగుతుండటంతో గ్రామసభలు, సమావేశాల నిర్వహణ, రికార్డులు భద్రపర్చడం కష్టంగా మారింది. సుమారు రెండేళ్ల కిందట కొత్త పంచాయతీలతో పాటు భవనాలు




శిథిలావస్థకు చేరిన గ్రామాల్లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణాలకు దశల వారీగా నిధులు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.20 లక్షల నిధులను మంజూరు చేశారు. పనులు మొదలై కొన్ని చోట్ల పూర్తయ్యాయి. చాలా చోట్ల పనులను అసంపూర్తిగా వదిలేశారు. సకాలంలో బిల్లులు రావడం లేదని, వడ్డీకి డబ్బులు తెచ్చి భవనాలు నిర్మించామని గుత్తేదారులు వాపోతున్నారు. బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయోనన్న అనుమానంతో పనులు చేయడానికి విముఖత చూపుతున్నారు. కొన్ని పంచాయతీ భవనాలు స్థల సమస్య, ఇతర కారణాలతో నేటికి పనులు ప్రారంభం కాలేదు.

# ఆనవాళ్లు కోల్పోతున్న మైసమ్మ గుట్ట

**సిరిసిల్ల,తెలంగాణ దిశ :**ప్రకృతి సంపదను అక్రమార్కులు చెరబట్టారు. ప్రభుత్వ నిర్మాణాల కిచ్చిన తాత్కాలిక అనుమతులను ఆసరాగా చేసుకుని ప్రైవేటు అవసరాలకూ తరలిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన రూ.కోట్ల రాయల్టీకి గండి పడుతోంది. వీటిపై తరచూ జిల్లా రెవెన్యూ, గనుల శాఖలకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు తనిఖీలకు వెళ్తే అక్కడెవరూ కనిపించరు. ఇది మరీ విచిత్రమైన పరిస్థితి. జిల్లా కేంద్రానికి సమీపంలో పెద్దూరులోని మైసమ్మ గుట్టకు చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. అక్రమార్కులు వీటిని చెరిపేస్తున్నారు. మానేరు వాగుపై చెక్‌డ్యాంల నిర్మాణం సమయంలో రెండువైపులా కాంక్రీటుతో రక్షణ గోడలు నిర్మించాలి. దీనికి బలం చేకూ ర్చేందుకు మట్టితో నింపి రాళ్లతో తెట్టును నిర్మించాలి. అప్పుడే చెక్‌డ్యాం వరదలకు కొట్టుకుపోకుండా ఉంటుంది. అయితే చెక్‌డ్యాం తొలి అంచనాల్లో ఈ ప్రతిపాదన లేదు. వరదలకు చెక్‌డ్యాంలు కొట్టుకుపోవడంతో మట్టికట్ట, తెట్టు నిర్మాణ పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు సూచించారు. దీనికోసం ఎల్లారెడ్డిపేట మండలం పదిర, వెంకటాపూర్‌లో నిర్మించిన చెక్‌డ్యాంలకు మైసమ్మగుట్టను సగానికిపైగా తొలిచేశారు. ఇప్పుడు మట్టి తవ్వకాల్లో బయటపడిన రాళ్లను తొలుస్తున్నారు. జిల్లాలోని మానేరు పరీవాహక ప్రాంతంలో ఆదిమానవుల జీవనవిధానాలను చరిత్రకారులు కనుగొన్నారు. సిరిసిల్ల శివారులోని బర్కమ్మ, సీతారి గుట్ట ప్రాంతాల్లో పలు రాతి చిత్రా లు వెలుగుచూశాయి. వాటి ఆధారంగా పరిశోధనలు కూడా జరిగాయి. మైసమ్మ గుట్ట పూర్వం వ్యాపార కేంద్రంగా ఉన్నట్లు పరిశోధకులు అధ్యయ నాల్లో గుర్తించారు. ఇక్కడ ఉన్న మట్టి ప్రతిమలను గ్రామదేవతలుగా ఇప్పటి కీ కొలిచి పూజలు చేస్తారు. అందుకే దీనికి మైసమ్మ గుట్టగా పేరు వచ్చింది. చరిత్ర పరిశోధకులు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి ప్రతిమలు ఎక్కడా చూడలేదని చెబుతున్నారు. ఇవి ఎప్పటివనేది కూడా నిర్ధారణ కాలేదు. పశ్చిమబెంగాల్‌లోని గ్రామాల్లో కొన్ని రూపాలు గ్రామ దేవతలుగా కొలుస్తారని మాత్రం చెబుతున్నారు. ఈ ప్రాంతాన్ని పరిశోధిస్తే మరిన్ని ఆసక్తికర విషయాలు వెలుగుచూసే అవకాశం ఉంది. అరుదైన చారిత్రక నేపథ్యం ఉన్న ఈ గుట్ట చుట్టూ తవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోకుం డా కాపాడుకోవాల్సిన అవసరం ఉంది.



# ఇక ఏఐ సాయంతో తిరుమల దర్శనం




**తిరుమల,తెలంగాణ దిశ :** తిరుమల శ్రీవారి దర్శనం కోసం కొండకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమల తిరుపతి దేవస్థానం చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే సాంకేతికత సాయంతో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే ఆలోచనలు చేస్తోంది. అందులో భాగంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో శ్రీవారి భక్తులకు రెండు గంటల్లోగా దర్శనం కల్పించే ఆలోచనను టీటీడీ గతంలో చేసింది. అయితే దీనిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావటం తో పాటుగా కొంతమంది నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. ఏఐ సాయంతో రెండు గంటల్లో శ్రీవారి దర్శనం గురించి విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రక్రియపై కాస్త వెనుకడుగు వేసిన టీటీడీ .. మరోసారి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించే ఆలోచన చేస్తోంది. ఈ విషయాన్ని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. ఈ క్రమంలోనే ఏఐ సాయంతో తిరుమల శ్రీవారి దర్శనం గురించి టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు కీలక వ్యాఖ్యలు చేశారు. ఏఐ ద్వారా రెండు గంటల్లో శ్రీవారి దర్శనం కల్పించాలనే ఆలోచన గతంలో చేసినట్లు బీఆర్ నాయుడు వివరించారు. అయితే ఓ వర్గం నుంచి వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. టీటీడీ నూతన ఈవో అనిల్ కుమార్ సింఘాల్ ఆధ్వర్యంలో త్వరలోనే ఈ ఏఐ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కి స్తామని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వెల్లడించారు. తాము బాధ్యతలు చేపట్టిన తర్వాత తిరుమల అన్నప్రసాదాల్లో మార్పులు వచ్చాయని బీఆర్ నాయుడు చెప్పుకొచ్చారు. భక్తులకు రుచికరమైన భోజనం అందిస్తున్నామని.. లడ్డూ ప్రసాదంలోనూ చాలా మార్పులు చేశామన్నారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదాలు 10 రోజులైనా నిల్వ ఉంటున్నాయని భక్తుల నుంచ్ స్పందన వస్తోందన్నారు. తిరుపతివా సులు మూడు వేల మందికి ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శన భాగ్యం కల్పిస్తున్నామని వివరించారు. తిరుమల కాటేజీలకు దేవుడి పేర్లు పెట్టాలని నిర్ణయించామని.. టీటీడీలోని అన్యమతస్తులను కూడా కొంతమందిని ఉద్యోగాల నుంచి తొలగించా మన్నారు. తిరుమల శ్రీవారి బ్రేక్ దర్శనాల విషయంలోనూ మార్పులు చేశామని బీఆర్ నాయుడు వివరించారు. ఉదయం పదిన్నరకు ఉండే బ్రేక్ దర్శనాలను తెల్లవారు జామునకు మార్చామన్నారు. శ్రీవాణ ట్రస్టు కింద 5 వేల ఆలయాల నిర్మాణం, ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో గుడులు, భజన మందిరాలు నిర్మించనున్న ట్లు తెలిపారు. మరోవైపు తిరుమల తరహాలో టీటీడీ ఆధ్వర్యంలోని ఆలయాల్లో నిత్యాన్నదానం అమలు చేయనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు వివరించారు. తిరుపతి తిరుమల మధ్యన ఎలక్ట్రికల్ బస్సులు నడుపుతామని టీటీడీ ఛైర్మన్ చెప్పుకొచ్చారు. కేంద్ర మంత్రి కుమారస్వామి టీటీడీకి 100 ఎలక్ట్రిక్ బస్సులు ఇస్తామన్నారని.. వాటిని తిరుపతి, తిరుమల మధ్య నడపనున్నట్లు తెలిపారు. దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలో శ్రీవారి ఆలయం నిర్మిస్తామన్న టీటీడీ ఛైర్మన్.. కరీంనగర్‌లో రూ.30 కోట్లతో , దుబ్బాకలో రూ.4.5 కోట్లతో శ్రీవారి ఆలయాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు.


# బెంగళూరు జైల్లో ఖైదీలకు సర్వభోగాలు!

బెంగళూరు: బెంగళూరు జైలులో సకలభోగాలు అనుభవిస్తున్న ఖైదీలకు సంబంధించిన వీడియో ఒకటి ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. పలు తీవ్రమైన కేసుల్లో శిక్షలు పడిన ఖైదీలు, రేపిస్టులు, నేరస్తులు జైలులో తెగ ఎంజాయ్ చేయడం ఈ వీడియోలో కనిపిస్తుంది. కొందరు దర్జాగా మొబైల్ ఫోన్లలో మాట్లాడుతుంటే.. మరికొందరు ఎంచక్కా టీవీలు చూస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ఈ జైలులోని ఖైదీలు శిక్ష అనుభవిస్తున్న తీరు చూసి ప్రతి ఒక్కరూ నోరెళ్లబెడుతున్నారు. కర్ణాటక రాజధాని బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులోని ఖైదీల లగ్జరీ లైఫ్‌కు సంబంధించిన దృశ్యాలు ఇవి. ఈ వీడియోలో కనిపించిన ఖైదీల్లో 1996 నుంచి 2022 మధ్య 20 మంది మహిళలపై అత్యాచారం చేయడంతోపాటు వారిలో 18 మందిని హత్య చేసిన కేసులో దోషిగా తేలిన ఉమేష్ రెడ్డి కూడ ఉన్నాడు. ఇతగాడికి కోర్టు తొలుత మరణశిక్ష విధించింది. అయితే ఆ తర్వాత జరిగిన పరిణామాల్లో అది 30 ఏళ్ల కఠిన కారాగార శిక్షగా మారింది. ప్రస్తుతం బెంగళూరులోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్న ఉమేష్ రెడ్డి మొబైల్ ఫోన్‌లో మాట్లాడుతూ, టీవీలో ఐటెం సాంగ్ చూస్తూ కనిపించాడు. అతని వద్ద 2 ఆండ్రాయిడ్ ఫోన్లు, మరో కీ ప్యాడ్ మొబైల్ ఫోన్‌లు ఉన్నాయి. ఉమేష్ రెడ్డిని ఉంచిన సెల్‌లో ఒఇఆ టీవీ సదుపాయం కూడా ఉంది. ప్రముఖ నటి రన్యా రావు గోల్డ్ స్మగ్లింగ్ కేసులో అరెస్టైన తరుణ్ రాజు కూడా ఇదే జైలులో సకల భోగాలు అనుభవిస్తున్నాడు. అతడున్న జైలు గదిలో స్వయంగా వంట చేసుకునే సదుపాయం కూడా ఉంది. వీరివద్దనే కాదు ఇతర ఖైదీల వద్ద కూడా మొబైల్ ఫోన్లు ఉండటం విశేషం. కన్నడ నటుడు దర్శన్‌కు జైలు అధికారులు ప్రాథమిక సౌకర్యాలు నిరాకరించగా, ఇక్కడి చాలా మంది కరడుగట్టిన క్రిమినల్స్, రేపిస్టులకు మాత్రం ఎటువంటి పరిమితులు లేకుండా కటకటాల వెనుక విలాసవంతమైన జీవితాన్ని అనుభవిస్తున్నట్లు ఈ వీడియో ద్వారా తెలుస్తుంది. వీరితో పాటు ఐసిస్ ఉగ్రవాది జుహాద్ హమీద్ షకీల్‌కు చెందిన మరో వీడియో కూడా ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. అతడు జైలు లోపల గాడ్జెట్‌లు, ఇతర సౌకర్యాలు యదేచ్ఛగా అనుభవిస్తున్నాడు.

## పాస్‌వర్డులతో జాగ్రత్త..

# సులభంగా ఉంటే సైబర్ క్రిమినల్స్‌కు చిక్కినట్టే!

## 2025లో వాడిన వాటిలో సులువైనవే ఎక్కువ





న్యూఢిల్లీ: ఆన్‌లైన్ అకౌంట్ పాస్‌వర్డు చాలా క్లిష్టంగా ఎవరూ ఊహిం చని విధంగా ఉండాలని సైబర్ క్రైమ్ విభాగాలు హెచ్చరిస్తుంటాయి. అయితే ఓ తాజా అధ్యయనం ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2025లో ప్రజలు అత్యధికంగా 123456, అడ్మిన్, పాస్‌వర్డ్, ఇండియాఏ123 వంటి పాస్‌వర్డులను ఉపయోగించారు. దాదాపు 200 కోట్ల ఖాతాలకు చెందిన పాస్‌వర్డులు సులభంగా హ్యాకింగ్‌కు గురయ్యే రీతిలో ఉన్నట్లు కంపేరిటెక్ పరిశోధకులు వెల్లడించారు. సర్వసాధారణంగా అత్యధికులు ఉపయోగించే పాస్‌వర్డులలో అడ్మిన్, ఎఎ123456, 123, 12345 67890, పాస్‌వర్డు ఉన్నాయి. 123 456 పాస్‌వర్డును 76 లక్షల మందికిపైగా ప్రజలు ఉపయోగిస్తున్నారు. కాగా, అడ్మిన్ అనే పాస్‌వర్డును 19 లక్షల మందికిపైగా వినియోగిస్తున్నారు. అత్య ంత సర్వసాధారణమైన 100 పాస్‌వర్డుల జాబితాలో ఇండియాఏ123కి 53వ స్థానం దక్కింది.

అత్యధికంగా వాడిన పాస్‌వర్డులివే: ప్రపంచవ్యాప్తంగా ప్రజలు అత్యధికంగా ఉపయోగిస్తున్న పాస్‌వర్డులలో 123456, 12345678, అడ్మిన్, 1234, ఎఎ123456, 12345, పాస్‌వర్డు, 123, 1234567890 ఉన్నాయి.


ఎలాంటి పాస్‌వర్డ్ ఉండాలి?: ఆన్‌లైన్ అకౌంట్ సురక్షితంగా ఉండాలంటే పలు జాగ్రత్తలు తీసుకోవాలని మైక్రోసాఫ్ట్ వంటి కంపెనీలు సూచిస్తున్నాయి. పాస్‌వర్డుకు కచ్చితంగా 12 అక్షరాలు ఉండాలి. ఇందులోని అక్షరాలు క్యాపిటల్, స్మాల్ లెటర్స్ కలగలిపి ఉండాలి. మధ్యలో సంఖ్యలు, చిహ్నాలు కూడా ఉండాలి.

# సెహభాష్... తెలంగాణ పోలీస్




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**మనం అనేక సందర్భాల్లో చెప్పుకున్నాం కదా.. పోలీసుల మీద రాజకీయ ఒత్తిడి లేకుంటే.. పోలీసులను వారి పని వారిని చేసుకొనిస్తే అద్భుతమైన ఫలితాలు వస్తాయని.. అసాంఘిక శక్తుల ఆటలు సాగవని.. సంఘవిద్రోహశక్తుల దుర్మార్గాలు ముందుకెళ్లవని.. అలాంటి పనిని తెలంగాణ పోలీసులు చేసి చూపించారు. యావత్తు దేశం మొత్తం తమ వైపు చూసుకునేలా చేశారు. నేటి స్మార్ట్ కాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దుర్మార్గులు రకరకాల విధాలుగా ప్రజలను మోసం చేస్తున్నారు.. మెసేజ్లు పంపించడం.. లింకులు సెండ్ చేయడం.. డిజిటల్ అరెస్టులు.. మాదక ద్రవ్యాలు దొరికాయని చెప్పడం.. ఇలా రకరకాల విధానాల్లో మోసాలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు సైబర్ నేరగాళ్లు.. ఇలా అమాయకులను మోసం చేస్తే కోట్లకు కోట్లు సంపాదిస్తున్నారు. పైగా ఈ డబ్బులను రకరకాల విధానాలలో మార్చేస్తూ తమ వద్దకు తెచ్చుకుంటున్నారు. ఇలా దొంగిలించిన డబ్బులను మ్యూల్ ఖాతాల సహాయంతో తమ వద్దకు తెచ్చుకుంటున్నారు.. అయితే ఈ తరహా మోసాలు ఇటీవల అధికంగా పెరగడంతో తెలంగాణ సైబర్ పోలీసులు దృష్టి సారించారు. అంతే కాదు సరికొత్త ఆపరేషన్ చేసి యావత్ దేశం మొత్తం తమ వైపు చూసేలా చేశారు. తెలంగాణ పోలీసులకు ఇటీవల కాలంలో సైబర్ ఫిర్యాదులు పెరిగిపోయాయి. తెలంగాణ సైబర్ పోలీసులు ఎన్ని విధాలుగా అవగాహన కల్పించినప్పటికీ నేరాలు తగ్గడం లేదు. ఈ నేపథ్యంలో ఇటీవల తమకు అందిన ఫిర్యాదుల ఆధారంగా తెలంగాణ సైబర్ పోలీసులు దర్యాప్తు మొదలుపెట్టారు.. అయితే ఈ తీగను తెలంగాణలో లాగితే ఐదు రాష్ట్రాల్లో డొంక కదిలింది.. 95 కోట్ల స్కాం బయటపడింది.. అంతేకాదు 81 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.. తెలంగాణలో వచ్చిన మోసానికి పాల్పడిన వ్యక్తులు మొత్తం కూడా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, కర్ణాటకలో ముఠాలుగా ఏర్పడ్డారని పోలీసుల విచారణలో తేలింది. ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో తెలంగాణ సైబర్ బ్యూరో దాడులు నిర్వహించింది. అరెస్టయిన వారిలో 17 మంది ఏజెంట్లు, ఏడుగురు మహిళలు, 58 మంది మ్యూల్ ఖాతాదారులు ఉన్నారు. నిందితుల నుంచి పోలీసులు 84 సెల్‌ఫోన్లతో పాటు 101 సిమ్ కార్డులు, 89 బ్యాంకు పాస్‌బుక్‌లు, చెక్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

# విదేశీ సంస్థల పెత్తనంలో మన బ్యాంకులు!



భారతీయ బ్యాంకుల యాజమాన్యంలో ప్రవాసులకు వాటా ఉండవచ్చు. ఐతే ఆ వాటా 15 శాతానికి మించకుండా ఉండాలని రిజర్వు బ్యాంక్ పరిమితి విధించింది. ఈ పరిమితిని ఆ యా సందర్భాన్ని బట్టి పెంచే అవకాశం ఉంది. ఏదేమైనా చట్టం ప్రకారం ఈ 15 శాతం పరిమితి అనేది ఇప్పటికీ కొనసాగుతోంది. ఐనప్పటికీ, 2018లో కెనడాకు చెందిన ఫెయిర్ ఫాక్స్ అనే కంపెనీ, (ఇది మారిషస్ నుంచి కార్యకలాపాలు నడుపుతోంది) కేరళ లోని కేథలిక్ సిరియన్ బ్యాంక్ వాటాలలో 51 శాతాన్ని కొనుగోలు చేయడానికి అనుమతించారు. కేంద్ర ప్రభుత్వం గాని, రిజర్వు బ్యాంక్ గాని 15 శాతం పరిమితిని ఇలా 2018లో ఉల్లంఘించవ లసిన అగత్యం ఏమిటో వివరించనేలేదు. అంతకు మునుపు, 1994లో (నయా ఉదారవాద విధానాల తొలి దినాల్లో) ఎస్ఎస్ చౌవాలా గ్రూపు సంస్థ (ఇది థారులాండ్ నుండి నడుస్తోంది) ఇదే బ్యాంకులో 34 శాతం వాటాలను కొనుగోలు చేస్తానని ముందుకొ చ్చినప్పుడు ఆ అభ్యర్థనను అప్పటి ప్రభుత్వం తిరస్కరించింది. అలా తిరస్కరించడం సరైనది. కాని ఆ తర్వాత 2018లో ఎందుకు అనుమతించారో ఇప్పటికీ వివరణ లేదు. ఇప్పుడు ఐడిబిఐ బ్యాంక్ (ఇండిస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా)ను ఒక విదేశీ ప్రైవేటు సంస్థకు అమ్మడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ ఐడిబిఐ బ్యాంక్ ప్రభుత్వ రంగ సంస్థగా ప్రత్యేకంగా పరిగణించబడకపోయి నప్పటికీ, దానిలోని మెజారిటీ వాటాదారుడిగా ప్రభుత్వ యాజమాన్యం కింద నడుస్తున్న ఎల్ఐసి సంస్థ 2019 నుంచీ ఉంది.

అందుచేత ఈ విషయమై ఎన్ని అభ్యంతరాలు వెలువడుతున్నప్ప టికీ, విదేశీ సంస్థలు మన దేశీయ బ్యాంకుల మీద పెత్తనం పొందడానికి అనుమతించేందుకు ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా మొగ్గు చూపుతోంది. ఎందుకు ఈ విధంగా జరుగుతోం దన్న విషయాన్ని ఇంతవరకూ వివరించే ప్రయత్నం ప్రభుత్వం గాని రిజర్వు బ్యాంక్ గాని చేయలేదు. సాధారణంగా ఇటువంటి ప్రధాన, విధానపరమైన మార్పులు చేపట్టినప్పుడు 'విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం కోసం' అంటూ సాకులు చెప్తారు. కాని ఈ సారి అటువంటిది కూడా లేదు. ఐతే, అటువంటి సాకు ఈ విషయంలో నిలబడదు. విదేశీ సంస్థలు మన బ్యాంకుల వాటాలను కొనుగోలు చేస్తే వచ్చే మొత్తమే చాలా తక్కువ. కేథలిక్ సిరియన్ బ్యాంక్‌లో 51 శాతం వాటాలను కొనుగోలు చేసిన ఫెయిర్ ఫాక్స్ సంస్థ చెల్లించినది కేవలం రూ.1200 కోట్లు మాత్రమే. పైగా, జూన్ 2024లో తమ వాటాల్లో కేవలం 9.72 శాతం వాటాలను అమ్మి రూ.592 కోట్లు, అంటే తాము చెల్లించిన దాంట్లో దాదాపు సగం, తిరిగి పొందారు. మన బ్యాంకుల యాజమాన్యం విదేశీ కంపెనీల చేతుల్లో ఉంటే అప్పుడు మన దేశంలోకి పెట్టుబడులు రావడానికి అనువైన వాతావరణం ఏర్పడుతుంది అన్న వాదన కూడా పూర్తిగా తప్పుడు వాదనే. గతంలో విదేశీ వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను రిజర్వు బ్యాంక్ ఖచ్చితంగా పాటించినప్పుడు కూడా విదేశీ పెట్టుబడులు బాగానే వచ్చాయి. ఇప్పుడు విదేశీ పెట్టుబడులు రావడం తగ్గిపోయి, వెనక్కి వెళ్ళిపోవడం పెరుగుతోందంటే అందుకు వేరే కారణాలు ఉన్నాయి (ఉదాహరణకు ట్రంప్ సుంకాల పెంపు). కొన్ని బ్యాంకులను విదేశీ సంస్థలకు అమ్మేసినంత మాత్రాను విదేశీ పెట్టుబడులు వెనక్కి పోతున్న ధోరణిని ఆపడం కూడా సాధ్యం కాదు. విదేశీ సంస్థల పెత్తనం కిందికి మన దేశీయ బ్యాంకులను అనుమతించే ప్రక్రియ ఎందుకిలా గోప్యంగా ముందుకు సాగుతోంది అందునా అటువంటి ప్రక్రియ వలన మన దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత వినాశకర ఫలితాలను చవి చూడవలసి వస్తుందని గుర్తించిన తర్వాత కూడా ఎందుకిలా జరుగుతోంది (మన బ్యాంకులలో విదేశీ సంస్థల వాటాలు 15 శాతానికి మించకూడదన్న నిబంధనను తొలుత రూపొందించి అమలు చేసినది ఇందుకే కదా)! బ్యాంకుల యాజమాన్యం విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే జరిగే హాని గురించి ఉన్నదానికన్నా ఎక్కువ చేసి చెప్తున్నారన్న వాదన ఉంది. భారతీయ బ్యాంకులు విదేశాల్లో ఆస్తులను కొనుగోలు చేయడం గురించి రిజర్వు బ్యాంక్ కొన్ని నిబంధనలను రూపొందించింది. ఆ నిబంధనలు మన బ్యాంకులకు కొన్ని పరిమితులు విధించాయి. ఆ పరిమితులకు లోబడి వ్యవహరించి నంత కాలం మన బ్యాంకుల యాజమాన్యం ఎవరి చేతుల్లో ఉందన్నది అంత ప్రధానం కాదు.

ఈ వాదనను ఒకవేళ అంగీకరించినా, అసలు మన భారతీయ బ్యాంకులను విదేశీ సంస్థకు ఎందుకు అప్పజెప్పాలన్న ప్రశ్నకు అది సమాధానం చెప్పదు. విదేశీ సంస్థల చేతుల్లో ఉంటే మన బ్యాంకుల నిర్వహణ బాగా మెరుగు పడుతుందన్న వాదన సైతం చెల్లదు. నిజానికి మన బ్యాంకులు విదేశీ సంస్థల చేతుల్లోకి పోతే అప్పుడు ఇక్కడ చిన్న స్థాయి రుణాలను పొందేవారికి ఆ బ్యాంక్ అందుబాటులో ఉండదు. నిజానికి బ్యాంకులు రుణాలు ఇచ్చేటప్పుడు వారికే ప్రాధాన్యతనివ్వాలి. కాని విదేశీ సంస్థల చేతుల్లో ఉన్నప్పుడు ఆ విధంగా జరగదు. పైగా అత్యున్నత స్థాయి అధికారుల జీతాలు మాత్రం బ్రహ్మాండంగా పెరుగుతాయి. కేథలిక్ సిరియన్ బ్యాంక్ అనుభవం ఇదే.

అంతే కాదు, ఒకసారి మన బ్యాంకుల మీద పెత్తనం విదేశీ కంపెనీల చేతుల్లోకి పోయిన తర్వాత వాళ్ళు విదేశీ ఆస్తుల కొనుగోలు విషయంలో ఉన్న ప్రస్తుత నిబంధనలను, పరిమితులను ఎత్తివేయాలని మన ప్రభుత్వం మీద వత్తిడి పెంచుతారు. ఆ పరిమితులను ఎత్తివేస్తే అప్పుడు ఈ బ్యాంకులు విదేశీ స్పెక్యులేటివ్ వ్యాపారాల్లో పెట్టుబడులను ఎక్కువగా పెట్టేందుకు అవకాశం కలుగుతుంది. ఎక్కువ లాభాలు వచ్చేటప్పుడు స్పెక్యులేటివ్ పెట్టుబడులైతే మాత్రం ఏమిటి నష్టం అని ప్రశ్నించవచ్చు. స్పెక్యులేషన్ అంటేనే ఒక తరహా జూదం. అందులో లాభాలు వస్తున్నప్పుడు బాగానే ఉంటుంది. ఐతే, ఆ లాభాల్లో ఒక్క పైసా కూడా డిపాజిట్‌దారుల ఖాతాల్లో పడదు. అంతా యజమానులకే పోతుంది. ఒకవేళ ఆ స్పెక్యులేషన్‌లో నష్టం వస్తే మాత్రం అప్పుడు బ్యాంకులు దివాలా తీసే ప్రమాదాన్ని కూడా ఎదుర్కోవలసి వస్తుంది. అప్పుడు డిపాజిటర్లు తమ కష్టార్జితాన్నంతటినీ పోగొట్టుకునే దుస్థితి వస్తుంది. అందుచేత చాలా పెద్ద సంఖ్యలో ఉండే డిపాజిటర్ల ప్రయోజనాల దృష్ట్యా చూసినప్పుడు ఈ స్పెక్యులేటివ్ పెట్టుబడులకు దిగడం అనేది చాలా హానికరం. అందువలన భారతీయ డిపాజిటర్లకు లాభాలు ఏవీ రావు సరికదా తమ సమస్తాన్నీ కోల్పోయే ప్రమాదం ఉంది. ఇదేదో పనీ పాటు లేనివాడెవడో ఊహించి చెప్తున్న విషయం కాదు. అమెరికాలో "హౌసింగ్ బుడగ" 2008లో పేలిపోయినప్పుడు ఆ బుడగ పెరుగుతున్న కాలంలో రుణాలు ఇచ్చిన సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని ప్రధాన బ్యాంకులన్నీ దెబ్బ తిన్నాయి. ఆ రుణాలన్నీ "పనికి మాలిన వ్యర్థ ఆస్తులు"గా ఆ బ్యాంకులకు మిగిలిపోయాయి. అప్పుడు ప్రభుత్వాలు బ్యాంకులకు భారీగా 'బెయిల్ ఔట్" ప్యాకేజీలు ప్రకటించవలసి వచ్చింది. ఆ బెయిల్ అవుట్ల కారణంగా డిపాజిటర్లు గణనీయంగా నష్టపోయారు. ఆ హౌసింగ్ బుడగ పేలుడు తాకిడి తగలకుండా తప్పించుకున్న ఒక ప్రధాన దేశం మనదే. ఎందుకంటే అప్పటికి మన భారతీయ బ్యాంకులలో విదేశీ ఆస్తుల వాటా నామమాత్రమే. దాని వలన "వ్యర్థ ఆస్తుల" వాటా కూడా చాలా తక్కువగానే ఉండింది. ప్రైవేటు రంగంలోని ఐసిఐసిఐ బ్యాంక్ మాత్రమే కాస్త గణనీయమైన మోతాదులో ఆ "వ్యర్థ ఆస్తులను" మూటగట్టుకుంది తప్ప ప్రభుత్వ రంగ బ్యాంకులన్నీ దాదాపు ఏ నష్టమూ చవిచూడకుండా బైటపడ్డాయి.

ఇప్పుడు మన బ్యాంకుమీద పెత్తనాన్ని విదేశీ సంస్థల చేతుల్లో పెడితే అప్పుడు మన ఆర్థిక వ్యవస్థకు 2008 నాడు ఉన్న బలం ఇంకెతంమాత్రమూ ఉండదు. బ్యాంకుల మీద విదేశీ పెత్తనాన్ని అనుమతించాలన్న వత్తిడి మనకు నయా ఉదారవాదం వైపు నుండి వస్తోంది. పెట్టుబడుల మీద ఏ విధమైన ఆంక్షలనూ నయా ఉదారవాదం అంగీకరించదు. ముఖ్యంగా ప్రభుత్వాలు ఆంక్షలు పెట్టడాన్ని అది ఒప్పుకోదు. మరీ ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాల ప్రభుత్వాలు పెట్టే ఆంక్షలను అది సుతరామూ అంగీకరించదు. అందుకే ప్రస్తుతం ఉన్న 15 శాతం పరిమితినీ తొలగించాలని వత్తిడి చేస్తుంది. అంతేగాక, భారత ఆర్థిక వ్యవస్థ మీద తన పట్టు పెరగాలంటే భారతీయ బ్యాంకుల మీద పెత్తనం సాధించడం సామ్రాజ్యవాదానికి కీలకమైన అంశంగా ఉంటుంది (నయా ఉదారవాదం అంటేనే సామ్రాజ్యవాదపు వ్యూహం అని మనం గ్రహించాలి). విదేశీ యజమానికి విదేశీ ప్రభుత్వం నుండి పూర్తి దన్ను లభిస్తుంది. అదే మాదిరి దన్ను భారతీయ యజమానికి మన ప్రభుత్వం నుండి అభించదు.

ప్రభుత్వ నియంత్రణ ఉన్న కాలంలో (1990 దశకానికి ముందు కాలంలో) భారతీయ ఆర్థిక రంగంలో చేపట్టిన పురోగామి చర్యలన్నింటినీ ఇప్పటికే గణనీయంగా నయా ఉదారవాదం తిరుగుముఖం పట్టించింది. ఉదాహరణకు: ప్రాధాన్యతా రంగ రుణాలకు సంబంధించి పాటించవలసిన ప్రమాణాలు నేటికీ కొనసాగుతున్నా, అసలు ప్రాధాన్యతా రంగం అంటే ఏమిటన్న నిర్వచనాన్నే మార్చివేశారు. అంతకు ముందు రైతులు, చిన్న ఉత్పత్తిదారులు, చిన్న వ్యాపారులు, బలహీన వర్గాల వారు ప్రాధాన్యతారంగంగా పరిగణించబడ్డారు. ఇప్పుడు అటవంటి తరగతుల ప్రజలకు బ్యాంకుల నుండి రుణాలు లభించడం దాదాపు అసాధ్యం అయ్యే విధంగా విధానాలను మార్చివేశారు. ఇటీవల ఐద్వా చేసిన అధ్యయనం ప్రకారం, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీలకు, మైక్రో ఫైనాన్స్ కంపెనీలకు బ్యాంకులు 10 శాతం కన్నా తక్కువ వడ్డీకే రుణాలనిస్తున్నాయి. ఆ ఫైనాన్స్ కంపెనీలు పేద మహిళలకు 26 శాతం వడ్డీకి రుణాలను ఇస్తున్నాయి. బ్రిటిష్ వాడి కాలంలో గ్రామాల్లో వడ్డీ వ్యాపారి పేదలను ఏ విధంగా కొల్లగొట్టేవాడో, అదే మాదిరిగా ఇప్పుడు జరుగుతోంది. చిన్న వ్యాపారులకు, చిన్న పరిశ్రమలకు తేలికగా, మధ్య దళారీలు లేకుండా, రుణాలను అందుబాటులోకి తీసుకురావాలన్న లక్ష్యం ఒకటిగా ఉంది. ఇప్పుడా లక్ష్యమే దెబ్బ తినిపోయింది.

# ఐక్య పోరాటంతోనే రిజర్వేషన్లు



దేశంలో, రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ముసుగులో విద్రోహ పాలన కొనసాగుతున్నది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు కావస్తున్నా, నేటికీ బలహీనవర్గాలకు, అత్యంత వెనుకబడిన సంచార జాతుల ప్రజలకు రాజ్యాధికారం దక్కడం లేదు. ఇప్పటికీ ఆధిపత్య వర్గాల చేతుల్లో బీసీలు నయవంచనకు గురవుతూనే ఉన్నారు. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో బీసీలకు వర్గీకరణతో కూడిన 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి మోసం చేయడమే అందుకు తాజా ఉదాహరణ. బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన రెండు బిల్లులను ప్రతిపక్షాల సంపూర్ణ మద్దతుతో చట్టసభల్లో ఆమోదించి, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపించిన రాష్ట్ర పాలకులు ఒక పద్ధతి ప్రకారం రిజర్వేషన్లు అమల్లోకి రాకుండా కుట్ర చేస్తున్నారు. ఇది తమను మభ్యపెట్టే ప్రయత్నమని బీసీ సంఘాలు, బీసీ మేధావులు, బీసీ సమాజం పసిగట్టకపోవడం బాధాకరం. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 (4), 15 (5), 16 (4) ప్రకారం.. బీసీ కులాలను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులుగా గుర్తించారు. అదే విధంగా స్థానిక సంస్థల్లో ఆర్టికల్ 243 ప్రకారం బీసీ కులాలను వెనుకబడిన పౌరులుగా గుర్తించారు. భారత రాజ్యాంగంలో సరైన విధంగా గుర్తించకపోవడం బీసీ కులాలకు శాపంగా మారింది. రాజ్యాంగంలో బీసీలకు సంబంధించిన ఆర్టికల్స్‌లోని లోపాల ఆధారంగా వెలువడుతున్న సుప్రీంకోర్టు తీర్పులు కూడా బలహీనవర్గాలకు నష్టం చేకూరుస్తున్నాయి. రాజ్యాంగంలో వెనుకబడిన కులాలను వెనుకబడిన తరగతులుగా, వెనుకబడిన పౌరులుగా గుర్తించినందున రాజ్యాంగ సవరణ చేయకుండా, ఇప్పటికిప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించలేమని కాంగ్రెస్ పాలకులకు తెలుసు. అయినా, కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ కోటాను 42 శాతానికి పెంచి, వర్గీకరణ ద్వారా రిజర్వేషన్లు అమలుచేస్తామని హామీ ఇచ్చింది. బీసీ వర్గాల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలకులపై రిజర్వేషన్లు కల్పించే బాధ్యత ఉన్నది. కాబట్టి, గతంలో కోర్టులు వెలువరించిన తీర్పుల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయవచ్చని బీసీ సామాజిక ఉద్యమకారులు, న్యాయ నిపుణులు కాంగ్రెస్ పాలకులకు సూచిస్తున్నారు. ఆ తీర్పులను ఒక్కసారి పరిశీలిద్దాం. 1992లో 9 మంది జడ్జిలతో కూడిన సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 27 శాతం ఓబీసీ రిజర్వేషన్లకు సంబంధించిన మండల్ కమిషన్ తీర్పును వెలువరించింది. ఇందులో ప్రధానంగా మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించరాదని నిబంధనను విధిస్తూనే.. ఒకవేళ బీసీ గణాంకాలు ఆమోదయోగ్యంగా ఉండి, ప్రత్యేక పరిస్థితుల్లో బీసీల ప్రాతినిధ్యం లేనట్టయితే 50 శాతానికి మించి కూడా రిజర్వేషన్లను అమలు చేసుకోవచ్చని అదే తీర్పులో తెలిపింది. ఈ తీర్పు ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయవచ్చు కదా?

2022లో బీఆర్ఎస్ సర్కార్ ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచడంతో విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు 54 శాతానికి చేరుకున్నాయి. 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి రిజర్వేషన్లు 64 శాతానికి చేరుకున్న విషయం అందరికీ తెలిసిందే. అందుకే రాష్ట్ర పాలకులు భారత రాజ్యాంగం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను నిర్ధారించి అమలుచేయాలి. అంతేగానీ, ప్రత్యేకంగా కేంద్ర ప్రభుత్వం అనుమతి అవసరం లేదనే విషయాన్ని గమనించాలి. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బీసీ బిల్లులను అమలుచేసి బీసీ కులాలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను వర్గీకరణ ద్వారా వెంటనే అమలు చేయాలి. ఎందుకంటే అధికార పక్షంతో పాటు రాష్ట్రంలోని అన్ని రాజకీయ పక్షాలు శాసనసభలో ఈ బిల్లులకు మద్దతు తెలిపాయి. రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో రిజర్వేషన్లను అమలు చేస్తే అన్ని రాజకీయ పక్షాలు అండగా నిలుస్తాయనడంలో సందేహం లేదు. ఒకవేళ ఈ విషయంలో ఎవరైనా పార్టీపరంగా గాని, సంస్థలపరంగా గాని, వ్యక్తుల పరంగా గాని హైకోర్టు, లేక సుప్రీంకోర్టులో కేసులు వేసినట్టయితే, రాష్ట్ర బీసీ జాబితాలో అత్యంత వెనుకబడిన సంచార జాతుల కులాలు ఇప్పటి వరకు ఎలాంటి రాజ్యాంగపరమైన రిజర్వేషన్లు పొందలేదని, వారికి పదవులు దక్కలేదని కోర్టులకు తెలపాలి. అలాగే సామాజికపరమైన రిజర్వేషన్ ఫలితాలు వీరి దాకా చేరనేలేదనే విషయాన్ని తెలియజేయాలి.

బుడబుక్కల, దాసరి, దొమ్మర తదితర కులాలవారు రాష్ట్ర ప్రభుత్వ గెజిట్‌లో ఉన్నాయని ఇప్పటి వరకు పాలకులకు, 99 శాతం మంది అధికారులకు తెలియదు. ఈ కులాల అభ్యున్నతికి ఇకనైనా పాటుపడకపోతే ఎలా? విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో ఈ కులాల ప్రాతినిధ్యాల లెక్కలను కోర్టుల ముందుపెట్టి రిజర్వేషన్లను సాధించాలి. మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చినట్టుగా వర్గీకరణతో కూడిన రిజర్వేషన్లు కల్పించాలి. లేకపోతే కాంగ్రెస్ పార్టీని బీసీ వర్గాలు మరోసారి నమ్మవు. అదేవిధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చొరవ తీసుకొని బీసీ రిజర్వేషన్లపై న్యాయ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి. అందుకోసం రాజ్యాంగాన్ని సవరించాలి. తద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బీసీల సమస్యను శాశ్వతంగా తీర్చాలి. రాజ్యాంగంలో విద్య, ఉద్యోగ ఇతర అంశాలకు సంబంధించిన అధికరణల్లో బీసీ తరగతులను సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన అధికరణల్లో కూడా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలుగా గుర్తించాలి. ఐక్యకార్యాచరణతో రాజకీయ చైతన్య యుద్ధానికి బీసీలు సిద్ధం కావాలి. సాధించే వరకు పోరాటం

## రామయపల్లి గ్రామాన్ని సింగరేణి సంస్థ తీసుకోవాలి

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :**వ్యవసాయ భూములు మాత్రమే తీసుకుంటామంటే ఊరుకునేది లేదని రామయ్యపల్లి గ్రామాన్ని క డా సింగరేణి సేకరించాలి అని పేర్కొన్నారు.సింగరేణి విధానాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటం చేస్తాం మాజీ ఎంపీపీ అరెల్లిదేవక్క కొమురయ్యగౌడ్ హెచ్చరించారు రామగిరి మండలంలోని సింగరేణి ఓసీపీ టూ విస్తరణ కోసం సింగరేణి యాజమాన్యం రాజా పూర్ గ్రామంతోపాటు 444 ఎకరాల భూమిని తీసుకుంటామని ప్రతిపాధిస్తున్నట్టు సింగరేణి జీఎం చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు రామగిరి మాజీ ఎంపీపీ అరెల్లి దేవక్క కొమురయ్యగౌడ్ పేర్కొన్నారు. సింగరేణి ఓసీపీ టూ విస్తరణలో భాగంగా పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం బుధవారంపేట, రాజాపూర్ గ్రామాల పరిధిలోని 708 ఎకరాల వ్యవసాయ భూమిని గతంలో సింగరేణి అధికారులు స్వాధీ నం చేసుకున్నారు. దీనిపై రెండు గ్రామాల రైతులు కోర్టుకు వెళ్లగా ఆ భూమిని తిరిగి రైతులకు ఇవ్వడం జరిగింది.



## మాదకద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమం

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆకస్మిక తనిఖీ

**కొడిమ్యాల,తెలంగాణ దిశ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ కొడిమ్యాల మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపి రిజిస్టర్స్ రికార్డులను పరిశీలించారు. ఫార్మసీ రూమ్‌లో అన్ని రకాల మందులను అందుబాటులో ఉంచుకోవాలని, మందులను ఎక్స్పైరీ డేట్ చూసుకుంటూ పేషెంట్స్ కి ఇవ్వవలెనని తెలిపారు. తర్వాత ఇమ్మ్యునైజేషన్ గదిని పరిశీలించారు. పిల్లలకు ఇచ్చే టీకాలను సరైన టెంపరేచర్ నందు భద్రపరచవలనని సూచించారు. ల్యాబ్ ను పరిశీలించి పేషెంట్స్ కి అవసరమైన రక్త పరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వవలెనని చెప్పారు. మాదకద్రవ్యాలు వాడడం వలన ఆరోగ్యం దెబ్బతింటుందని, జీవితాలు కోల్పోతారని, కుటుంబాలు విచ్ఛిన్నమవుతాయని జరిగే అనర్థాల గురించి ప్రజలకు సిబ్బందికి అవగాహన కల్పిస్తూ సిబ్బంది ప్రజల చేత మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ తో పాటు జిల్లా ఇమ్మ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్ మండల వైద్య అధికారులు డాక్టర్ నరేష్, డాక్టర్ పరమేశ్వరి, డిపిఓ (ఎన్సిడి) రవీందర్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజశేఖర్, జిల్లా సీనియర్ అసిస్టెంట్ కుతుబుద్దీన్, సత్యప్రసాద్, సూపర్వైజర్లు వెంకట నరసమ్మ, అలివేలు, ఫార్మసీ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్స్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు

## ఊడ్చే యంత్రాలతో ఖజనా ఊడ్చేశారు...

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**సాధారణంగా పారిశుధ్యానికి నగరపాలక సంస్థలు భారీగా ఖర్చు పెడుతుంటాయి. ఒకప్పుడు పారిశుధ్య నిర్వహణ మొత్తం మనుషులు చేసేవారు. అయితే నగరాలు విస్తరించడం వల్ల.. శివారు ప్రాంతాలు పెరిగిపోవడం వల్ల పారిశుధ్య నిర్వహణ మనుషుల వల్ల కావడం లేదు. అందుకే నగరపాలక సంస్థలు చెత్త ఊడ్చడానికి ఖరీదైన యంత్రాలను అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. వీటిని కొనుగోలు చేయాలంటే భారీగా డబ్బులు కావాలి. అందువల్లే అవి అద్దె ప్రాతిపదికన తీసుకొస్తుంటాయి. ఇంతవరకు బాగానే ఉన్నా.. ఇప్పటికి చెల్లించే అదే భారీగా ఉంటున్నది. వాస్తవానికి ఆ స్థాయిలో చెల్లించే అద్దె ద్వారా కొత్త యంత్రాలు కొనుగోలు చేయవచ్చు. కానీ నగరపాలక సంస్థల్లో వ్యవహారం వేరే విధంగా ఉంటుంది కాబట్టి వందల కోట్లలో అద్దె చెల్లించడానికి సిద్ధంగా ఉంటారు.మనదేశంలో ప్రఖ్యాత నగరపాలక సంస్థల్లో బెంగళూరు ఒకటి. బెంగళూరు నగరం మనదేశ ఐటీ రాజధానిగా పేరుపొందింది. ఇక్కడ అనేక బహుళజాతి సంస్థలు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. గతంతో పోల్చి చూస్తే బెంగళూరు నగరం కూడా విపరీతంగా పెరిగింది. పెరిగిన నగరానికి తగ్గట్టుగానే సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత నగరపాలక సంస్థ మీద పడింది. వాస్తవానికి బెంగళూరులో రోడ్లు చాలా చిన్నవిగా ఉంటాయి. ఇక సాయంత్రం పూట ట్రాఫిక్ చెప్పాల్సిన పనిలేదు. వర్షం కురిస్తే మాత్రం నరకం కనిపిస్తుంది. బెంగళూరులో ప్రతిరోజు చెత్త భారీగా పోగుపడుతుంది. ఇలా పోగు పడిన చెత్తను శుభ్రం చేయాలంటే కార్మికులకు తలకు మించిన భారమవుతోంది. ఏటికేడు ఈ సమస్య పెరిగిపోతున్న నేపథ్యంలో నగరపాలక సంస్థ ఒక కీలక నిర్ణయం తీసుకుంది. అయితే ఈ నిర్ణయం 613 కోట్ల విలువైనది. ఇంతటి డబ్బు పెట్టి కొత్త యంత్రాలు కొనుగోలు చేస్తున్నారనుకుంటే పొరపాటే.బెంగళూరు నగరపాలక పరిధిలో చెత్తను శుభ్రం చేయడానికి.. రోడ్లను ఊడ్చడానికి ఏకంగా 46 స్వీపింగ్ యంత్రాలను బెంగళూరు నగరపాలక సంస్థ అధికారులు అద్దెకు తీసుకున్నారు.

ఏడు సంవత్సరాలపాటు ఈ యంత్రాలను వాడుకునే విధంగా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. వాస్తవానికి కర్ణాటక రాజధాని అయిన బెంగళూరు నగరంలో పారిశుద్ధ్యాన్ని పరిరక్షించడానికి తీసుకున్న నిర్ణయం అభినందనీయమైనప్పటికీ.. ఇంతటి ఖర్చుపెట్టి.. అది కూడా యంత్రాలను అద్దెకు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. కాంగ్రెస్ పరిపాలనలో ఇలాంటివి సహజమేనని వ్యాఖ్యానిస్తున్నారు.

## శభాష్ టీచర్


**- కుటుంబ కలహాలతో నిరాశ్రయులైన విద్యార్థికి, తల్లికి సాయం**
**- ఉపాధ్యాయులకు కేరళ విద్యాశాఖ మంత్రి ప్రశంస**

న్యూఢిల్లీ: కేరళ ఉపాధ్యాయులు పిల్లలకు అక్షరాలు నేర్పించడమే కాదు.. వారికి అండగా నిలబడుతున్నారు. కుటుంబ కలహాలతో ఇంటిలోకి అనుమతించకపోవడంతో నిరాశ్రయులైన ఆరో తరగతి విద్యార్థి, ఆయన తల్లికి సహాయం చేసి, భద్రత కల్పించిన ఉపాధ్యాయులను కేరళ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి ప్రశంసించారు. ఎర్నాకుళం జిల్లా తిరుమరడిలో ప్రభుత్వం పాఠశాల తరగతి గదిలో అనేక ప్లాస్టిక్ శీతల పానీయాల సీసాలు వదిలేసినట్లు ఉపాధ్యాయులు కనుగొన్న తరువాత ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. ప్రతిరోజూ జ్యూస్ బాటిల్ కొనే విద్యార్థి, ఆ బాటిళ్లను వదిలి వెళ్లేవాడని విచారణలో తేలింది. కౌన్సెలింగ్ సమయంలో ఆ విద్యార్థి తన తల్లి రోజూ ఇచ్చే రూ.20తో బతికేవాడినని, ఇంట్లో తనకు ఆహారం దొరకడం లేదని ఉపాధ్యాయులకు చెప్పాడు. తదుపరి విచారణలో విద్యార్థి తల్లిదండ్రుల మధ్య వివాదం జరిగిందని, ఆయన నాన్నమ్మ చాలా రోజులుగా తల్లిని, బిడ్డను ఇంట్లోకి రానివ్వటం లేదని తేలింది. కొన్ని రోజులుగా ఆ పిల్లవాడు, ఆయన తల్లి ఇంటి బయట గుబురుగా ఉన్న ప్రాంతంలో తాత్కాలిక షెడ్డులో నివసిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు చైల్డ్‌లైన్, పోలీసుల సహాయంతో తల్లిదండ్రులు, అత్తమామలతో మాట్లాడి అన్ని సమస్యలను పరిష్కరించారు. ఆ విద్యార్థిని, ఆయన తల్లిని ఇటీవల తండ్రి, నాన్నమ్మ తిరిగి ఇంట్లోకి అనుమతించారు. తిరుమరడిలోని ఉపాధ్యాయులు మానవత్వానికి ఆదర్శప్రాయమైన నమూనాను ప్రదర్శించారని విద్యాశాఖ మంత్రి శివన్‌కుట్టి అన్నారు. 'ఈ ఘటన మన ప్రభుత్వ



విద్యాసంస్థలు విద్యార్థుల భద్రత, శ్రేయస్సును నిర్ధారించడంలో ఎంత నిబద్ధతతో ఉన్నాయో చూపిస్తోందని, పాఠ్యాంశాల పరిమితులను దాటి చాలా దూరం వెళ్తుంది. కౌన్సెలింగ్ సమయంలో ఆరో తరగతి విద్యార్థి ఎదుర్కొంటున్న బాధను గుర్తించడం అభినందనీయం. ప్రధానోపాధ్యాయుడు, ఇతర ఉపాధ్యాయులు సకాలంలో జోక్యం చేసుకోవడంతో ఆ బిడ్డ, తల్లి ఇంటికి తిరిగి వెళ్లడానికి సురక్షితమైన వాతావరణం ఏర్పడింది' అని అన్నారు. 'ప్రతి విద్యార్థి సురక్షితంగా ఉండేలా చూసేందుకు రాత్రింబవళ్లు అవిశ్రాంతంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ ప్రభుత్వ విద్యాశాఖ తరపున నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మీరు కేవలం అక్షరాలు నేర్పించడం మాత్రమే కాదు. మీరు వారి జీవితాల్లో ప్రేమ, కరుణ వంటి గొప్ప పాఠాలను బోధిస్తున్నారు' అని పేర్కొన్నారు. సమస్య పరిష్కారమైన తరువాత తల్లీబిడ్డ తమ కృతజ్ఞతలు తెలియజేయడానికి పాఠశాలకు వెళ్లారు. ప్రధానోపాధ్యాయుడు, తరగతి ఉపాధ్యాయుడిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పంచాయతీ అధికారులు ఆ చిన్నారి ఇంటికి వెళ్లి తమ మద్దతును అందించారు.


## బీజేపీ పెద్దలకు దగ్గరవుతున్న చంద్రబాబు



**విజయవాడ,తెలంగాణ దిశ :**ఏపీ సీఎం చంద్రబాబుకేంద్ర పెద్దల వైఖరి పూర్తిగా మారిపోయిందని చెప్పవచ్చు. 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత చంద్రబాబు ప్రాధాన్యం కేంద్రంలో పెరిగింది. దానికి కారణం ఎన్డీఏలో కీలక భాగస్వామిగా ఉండి.. మోదీ మూడోసారి ప్రధాని అయ్యేందుకు అవసరమైన సంఖ్యా బలాన్ని అందించగలిగింది తెలుగుదేశం పార్టీ. అయితే గత అనుభవాల దృష్ట్యా చంద్రబాబు కేంద్ర పెద్దలతో చాలా సఖ్యతగా మెలుగుతూ వచ్చారు. గతానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఏ విషయంలోనూ గాబరా పడటం లేదు. కేంద్రంతో ఇబ్బందులు తెచ్చుకునే పరిస్థితి లేదు. అయితే ఈ కేంద్ర పెద్దలతో నమ్మదగని మిత్రుడు అనిపించుకున్నారో.. అదే పెద్దలతో శభాష్ అంటూ చప్పట్లు కొట్టించుకుంటున్నారు. విశాఖ పెట్టుబడుల సదస్సులో అయితే కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఏపీ సీఎం మాట్లాడుతున్నంతసేపు తన చప్పట్లతో ప్రోత్సాహం అందిస్తూ వచ్చారు. అలాగని ఆయన ఏదో ఒక డమ్మీ కేంద్రమంత్రి కాదు. అక్షరాల ప్రధాని నరేంద్ర మోడీ కోర్ టీం లో ఉన్న నేత. 2018లో ఎన్డీఏనుంచి దూరమయ్యారు చంద్రబాబు. అప్పటివరకు కేంద్ర ప్రభుత్వంతో భాగస్వామ్యమై పనిచేసిన ఆయన.. ఉన్నఫలంగా కేంద్ర ప్రభుత్వానికి దూరమయ్యారు. ఏపీకి ప్రత్యేక హోదా విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రాప్ లో పడ్డారు. ఆ సమయంలో కేంద్ర పెద్దలతో ఢీ కొట్టినంత పని చేశారు. అప్పుడే ఏపీలో చంద్రబాబు పని పట్టాలని కేంద్ర పెద్దలు నిర్ణయించుకున్నారు. కేంద్రానికి చెందిన ప్రత్యేక టీం ఏపీలో పనిచేసింది. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అద్భుత విజయం వెనుక బిజెపి వ్యూహాలు ఉన్నట్లు అప్పట్లో టిడిపి అనుమానించింది. అయితే 2019 నుంచి 2024 మధ్య ప్రతి పరిణామాన్ని గుణపాఠంగా మార్చుకుంది టిడిపి. తన తప్పు తెలుసుకున్న చంద్రబాబు కేంద్ర పెద్దలతో సఖ్యత ఏర్పాటు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ కేంద్ర పెద్దలు చంద్రబాబును నమ్మడం లేదన్న ప్రచారానికి చెక్ చెబుతూ.. కేంద్రమంత్రి పీయూష్ గోయల్ చంద్రబాబుకు అభినందనలతో ముంచెత్తడం విశేషం.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో.. సిఐఐ నేతృత్వంలో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరిగింది. దాదాపు 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయి. అయితే కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తోంది అని ఈ పెట్టుబడుల సదస్సుతో తేలిపోయింది. గత కొద్ది రోజులుగా ప్రపంచ దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయి. భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం ఏర్పాటు అవుతున్నాయి. తద్వారా ఏపీకి తమ సాయం ఉంటుందని కేంద్రం స్పష్టమైన సంకేతాలు పంపుతోంది. 2014 నుంచి 2024 వరకు ఏపీ విషయంలో కేంద్రం నుంచి అసంపూర్ణ సహకారం అందేది. కానీ గడిచిన 17 నెలల కాలంలో కేంద్రం వైఖరి చూస్తుంటే ఏపీ పట్ల పూర్తి ఉదారస్వభావం చూపుతున్నట్లు అర్థమవుతోంది. స్వయంగా ప్రధానికి అత్యంత సన్నిహితుడు అయిన పీయూష్ గోయల్ ఏపీ సీఎం చంద్రబాబు పట్ల చూపుతున్న గౌరవం చూస్తుంటే మాత్రం.. బిజెపి పెద్దలకు అత్యంత ఇష్టమైన నాయకుడిగా చంద్రబాబు అవతరించారని అనడంలో ఎటువంటి అతిశయక్తి లేదు.

## పార్కిన్సన్స్ వ్యాధికి అసలు కారణమిదే..

**- ఆస్ట్రేలియా పరిశోధనలో కీలక విషయాల వెల్లడి**
**- మెదడులోని రక్తనాళాల్లో మార్పులే వ్యాధి తీవ్రతకు కారణం**
**- ప్రోటీన్ల కంటే రక్తనాళాల పాత్రే ఎక్కువని గుర్తింపు**
**- ఈ ఆవిష్కరణతో కొత్త చికిత్సలకు మార్గం సుగమం**




పార్కిన్సన్స్ వ్యాధిపై ఇప్పటివరకు ఉన్న అవగాహనను మార్చేసే కీలక ఆవిష్కరణను ఆస్ట్రేలియా పరిశోధకులు కనుగొన్నారు. ఈ వ్యాధి కారణంగా మెదడులోని రక్తనాళాల్లో తీవ్రమైన మార్పులు సంభవిస్తాయని, ఇదే వ్యాధి ముదరడానికి ప్రధాన కారణమని వారు తేల్చారు. ఈ పరిశోధన భవిష్యత్తులో పార్కిన్సన్స్‌కు కొత్త చికిత్సా మార్గాలను అందుబాటులోకి తెచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఇప్పటివరకు పార్కిన్సన్స్‌కు మెదడులో ఆల్ఫా-సిన్యూక్లిన్ అనే ప్రోటీన్ పేరుకుపోవడమే కారణమని భావించేవారు. అయితే, ఆస్ట్రేలియాలోని న్యూరోసైన్స్ రీసెర్చ్ ఆస్ట్రేలియా సంస్థ తాజాగా విడుదల చేసిన ఒక ప్రకటన ప్రకారం, ప్రోటీన్ల కంటే మెదడులోని రక్తనాళాల్లో చోటుచేసుకునే మార్పులే వ్యాధి తీవ్రతలో కీలకపాత్ర పోషిస్తున్నాయని తేలింది. "సంప్రదాయకంగా పరిశోధకులు ప్రోటీన్లు, నరాల కణాల నష్టంపైనే దృష్టి పెట్టారు. కానీ, మేము మెదడులోని రక్తనాళాల వ్యవస్థపై దాని ప్రభావాన్ని చూపించగలిగాం" అని పరిశోధనలో కీలకపాత్ర పోషించిన డెర్యా డిక్ తెలిపారు. తమ అధ్యయనంలో మెదడులోని కొన్ని ప్రాంతాల్లో రక్తనాళాలు బలహీనపడటాన్ని, ముఖ్యంగా పనికిరాని రక్త కేశనాళికల అవశేషాలు (స్ట్రింగ్ వెస్సెల్స్) పెరగడాన్ని గుర్తించినట్లు డెర్యా వివరించారు.

# నో వర్క్... నో శాలరీస్...

## వైసీపీ ఎమ్మెల్యేల దారేది?

**విజయవాడ,తెలంగాణ దిశ :** ఏపీలో శీతాకాలం అసెంబ్లీ సమావేశాలు దగ్గర పడుతు న్నాయా? ఈసారి వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వస్తారా? లేకుంటే వేటు ఎదుర్కొంటారా? స్పీకర్ అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలతో ఆ ఎమ్మెల్యేల్లో కలవరం మొదలైందా? స్పీకర్ వ్యాఖ్యలు వెనుక అసలు ఉద్దేశం ఏంటి?ఈసారి అసెంబ్లీకి రాకుండేవేటు ఖాయమా? అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. వైసీపీ ఎమ్మెల్యేలపై వేటు ఖాయమా? వైసీపీలోని 10 మంది ఎమ్మెల్యేలపై స్పీకర్ అయ్యన్నపా త్రుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. అసెంబ్లీ సమావేశాలకు రాని వైసీపీ ఎమ్మెల్యేలపై చర్యలకు సిద్దమవుతున్నారు స్పీకర్. రాజ్యాంగబ ద్ధంగా తీసుకునే చర్యలపై పరిశీలన చేస్తున్నామన్నారు. మాజీ సీఎం జగన్ తప్ప, ఆపార్టీకి చెందిన మిగతా 10మంది ఎమ్మెల్యేలు ఏడాదిన్న రగా జీతాలు తీసుకొంటున్నారని వ్యాఖ్యానించారు. ఒక ఉద్యోగి ఆఫీసుకు రాకుంటే సస్పెండ్ చేస్తున్నామని, మరి ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుంటే తొలగించవద్దా? అంటూ ప్రశ్నించారు. ఈ లెక్కన వచ్చే సమావేశంలో వైసీపీ ఎమ్మెల్యేలపై స్పీకర్ ఏదో ఒక నిర్ణయం తీసుకో వడం ఖాయంగా కనిపిస్తోంది. అసెంబ్లీకి వెళ్లి లైవ్‌లో కనిపించాలని వైసీపీ ఎమ్మెల్యేలు తహతహలాడుతున్నారు. స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యల వెనుక. అలాగని పార్టీ అధినేత నిర్ణయాన్ని ధిక్కరించలేరు. ఈ నేపథ్యంలో జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు? అసెంబ్లీకి వెళ్లమని పార్టీ ఎమ్మెల్యేలకు చెబుతారా? వద్దంటారా? ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వెళ్లాలని భావిస్తున్నట్లు వైసీపీ నుంచి చిన్నపాటి ఫీలర్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వారి పరిస్థితి ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నచం దంగా మారింది.స్పీకర్ వ్యాఖ్యల వ్యవహారం వైసీపీలో ముసలం మొదలవ్వడం ఖాయమని అనేవాళ్లు లేకపోలేదు. గెలిచిన ఎమ్మెల్యేలు కనీసం నియోజకవర్గం సమస్యలను చెప్పుకోవడానికి లేకుండా పోయిందని లోలోపల మదన పడుతున్నారు. ఈ లెక్కన స్పీకర్ వ్యాఖ్యలు ఆ పార్టీ నేతల్లో కలకలం రేపుతున్నాయి. త్వరలో జరగనున్న అసెంబ్లీ సమావేశాల నాటికి వైసీపీ అధినేత ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో చూడాలి. ఎమ్మెల్యేల మాట ఏమోగానీ, అంతిమంగా నిర్ణయం తీసుకోవాల్సింది జగన్ మాత్రమే వాళ్లందరూ శాలరీ తీసుకుంటున్నారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకుండా జీతాలు తీసుకోవడంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు హాట్ కామెంట్స్ చేశారు.




అసెంబ్లీ సమావేశాలకు హాజరు కాని 10 మంది ఎమ్మెల్యేలు ప్రతి నెల జీతాలు తీసుకుంటున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మాత్రమే జీతం తీసుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ విషయంపై రాజ్యాంగ బద్ధంగా చర్యలు తీసుకుంటామని, అసెంబ్లీలో చర్చలు జరిపిస్తానని స్పీకర్ స్పష్టం చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత, ప్రతిపక్షం గా మారింది. కానీ పది శాతం సీట్లు రాకపోవ డంతో ప్రతిపక్ష నేత హోదా కోసం జగన్ న్యాయపోరాటం చేస్తున్నారు. కానీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపక్ష హోదా ఇచ్చేందుకు అంగీకరించడం లేదు. దీంతో వైసీపీ అసెంబ్లీ సమావేశాలకు బాయ్‌కాట్ చేస్తోంది. ఈ క్రమంలో 11మంది ఎమ్మెల్యేలు జగన్ సహా హాజరు కావడం లేదు. జగన్ తన జీతాన్ని తీసుకోవడం లేదని, మిగిలిన 10 మంది తీసుకుంటున్నారని స్పీకర్ మీడియాకు చెప్పారు. వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రాకపోతే చర్యలు తీసుకుంటామని అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. "రాజ్యాంగ బద్ధంగా ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది పరిశీలిస్తున్నాము" అని స్పష్టం చేశారు. జీతం తీసుకుని డ్యూటీ చేయకపోతే ఉద్యోగులను సస్పెండ్ చేస్తామని, ఉద్యోగం నుంచి తీసేస్తామని..అటువంటిది ఎమ్మెల్యేలపై ఎందుకు చర్యలు తీసుకోకూడదు?" అని అయ్యన్నపా త్రుడు ప్రశ్నించారు. "అసలు కోడికి గుడ్డుకు తేడా తెలియని వైసీపీ వాళ్ల గురించి మాట్లాడటం వేస్ట్"అనిఅన్నారు. రాష్ట్ర రాజకీయాలు భ్రష్టు పట్టాయని, రాజకీ యాలు కాస్ట్‌లీగా మారిపోయాయని కూడా వ్యాఖ్యానించారు. ఈ విషయంపై అసెంబ్లీలో చర్చలు జరగనున్నా యని, ప్రజల సమస్యలపై చర్చించాలం టూ ఎమ్మెల్యేలకు సూచించారు. ఎమ్మెల్యేలు జీతాలు తీసుకోవడంపై అసెంబ్లీలోచర్చిం చి ఎమ్మెల్యేల జీతాలు ఆపివేయడం లేదా సస్పెన్షన్‌లు విధించడం వంటివి జరగవచ్చు. ఈ మధ్య అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యేలు హాజరు కాకుండా, ప్రజల సమస్యలు చర్చించకపోవడం పట్ల నేతలు కూడా తీవ్ర విమర్శల చేస్తున్నారు. స్పీకర్ అయ్యన్నపా త్రుడు గతంలో కూడాపై తీవ్ర వ్యాఖ్యలు చేసి, మంత్రులు, ఎమ్మె ల్యేలపై చురకలు వేసిన సందర్భాలు ఉన్నాయి



## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

### సూర్యాపేట జిల్లా పశు వైద్యాధికారి శ్రీనివాసరావు

**నేరేడుచర్ల,తెలంగాణ దిశ :** సూర్యాపేట జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు జిల్లా పశు వైద్యాధి కారి దామచర్ల శ్రీనివాసరావు తెలిపారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రామాపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా టీకాలు వేసే కార్యక్రమం వేగవం తంగా కొనసాగుతుం దన్నారు. టీకాలు వేసే గ్రామాల్లో రైతులకు ఒకరోజు ముందుగా చాటింపుద్వారా సమాచారంఇస్తున్నట్లు తెలిపా రు. నేరేడుచర్ల మండలంలో నాలుగు బృందాలుగా ఏర్పడి అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో సహాయ సంచాలకులు కందుల సత్యనారాయణ, ఎల్ ఎస్ ఏ దుర్గాభవాని, సిబ్బంది మహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లా అథ్లెటిక్స్ కు ఎంపికైన చల్ గల్ విద్యార్థులు

**జగిత్యాల,తెలంగాణ దిశ :** ఉమ్మడి జిల్లా స్థాయి లో నిర్వహించనున్న అథ్లెటిక్స్ పోటీలకు చల్ గల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పి. డి. వెంకటలక్ష్మి తెలిపారు.
ఎస్. కే. ఎన్నార్ డిగ్రీ కళాశాలలో అథ్లెటిక్స్ లో తమ పాఠశాల విద్యార్థి కౌశిక్ వంద, 2 వందలు, 4 వందల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానం సాధించాడని, అలాగే హైజంప్ లో కళ్యాణ్ ద్వితీయ స్థానం సాధించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ కు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు కౌశిక్, కళ్యాణ్ లను ఆ పాఠశాల హెచ్. ఎమ్ లతాదేవి, ఏ.పి.సి చైర్మన్ నీరటి సుకన్య, కోచ్ లు విశ్వ ప్రసాద్, కృష్ణ ప్రసాద్, అజయ్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

# సర్ 2.0 పై కొనసాగేనా?

న్యూఢిల్లీ, : భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ, ఓటర్ల జాబితాలను డిజిటల్ యుగానికి అనుగుణంగా మార్చే ప్రయత్నం. బిహార్‌లో చేపట్టిన ప్రక్రియ విజయవంతమైంది. లక్షల మంది ఫేక్ ఓటర్లు తొలగిపోయారు. దీనిని దేశవ్యాప్తంగా అమలు చేయాలని ఈసీఐ భావిస్తోంది. అయితే,ఇది రాజకీయ వివాదాలకు కారణమవుతోంది. దేశవ్యాప్తంగా ఫేక్ ఓటర్లను గుర్తించి తొలగించాలనే ఈ కార్యక్రమం, డెమోక్రటిక్ ప్రాసెస్‌ను బలోపేతం చేస్తుందని ఈసీఐ చెబుతుంటే, వ్యతిరేకవాదులు ఇది ఓటర్ల హక్కులను దెబ్బతీస్తుందని ఆరోపిస్తున్నారు.ఎస్ఐఆర్ ఓటర్ల జాబితాలను విస్తృతంగా సమీక్షించి, అక్రమ ఎంట్రీలను తొలగించే ప్రక్రియ. దీని ద్వారా జన్మస్థలం, ఆధార్ వంటి డాక్యుమెంట్లను ధ్రువీకరించి, డూప్లికేట్లు, అన్‌వెరిఫైడ్ రికార్డులను ఇన్‌స్పెక్ట్ చేస్తారు. 2025లో రెండో దశలో 9 రాష్ట్రాలు (ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ,మధ్యప్రదేశ్, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్) మరియు 3 కేంద్రపాలిత ప్రాంతాలు (అండమాన్ ? నికోబార్, లక్షద్వీప్, పుదుచ్చేరి)లో మొదలైంది. మొత్తం 321 జిల్లాల్లో 1,850 అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్ చేస్తూ, 10 లక్షల మంది అధికారు లు పాల్గొంటారు. డిసెంబర్ 4 నాటికి పూర్తి అవుతుందని ఈసీఐ ప్రకటించింది. ఎన్నికల నిర్వహణలో పారదర్శకతను పెంచడానికి డిజిటల్ టూల్స్‌ను ఉపయోగిస్తుంది, కానీ దీనిఅమలులో రాజకీయ పక్షాల నుంచి వ్యతిరేకత వస్తోంది.బిహార్‌లో ఎస్ఐఆర్ విజయవంతమైంది. ఎస్ఐఆర్ తర్వాత 65 లక్షల మంది ఫేక్ ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఇందులో డూప్లికేట్లు, మర్గదార్శకాలు అక్రమ ఎంట్రీలు ఉన్నాయని చెబుతున్నారు. అయితే, ఈ ప్రక్రియ సుప్రీం కోర్టులో సవాల్ చేయబడింది. ఎందుకంటే 30 లక్షల మంది చట్టబద్ధ ఓటర్లు తొలగించబడ్డారనికాంగ్రెస్ వంటి పార్టీలు ఆరోపిస్తున్నాయి. ఇటీవలి విశ్లేషణలు, 14లక్షలడూప్లికేట్లు, 1.32 కోట్లు కుటుంబాల మధ్య మిక్సప్‌లను తెలియజేస్తున్నాయి, ఇది ప్రక్రియలో లోపాలను సూచిస్తోంది. బిహార్ అనుభవం, ఎస్ఐఆర్ సామర్థ్యాన్ని చూపిస్తూనే, అమలు లోపాలు, రాజకీయ దుష్ప్రయోగాల అవకాశాలను కూడా హైలైట్ చేస్తోంది.ఓటర్ డేటా అసమతుల్యతలు పశ్చిమ బెంగాల్‌లో ఎక్కువ. అయినా అక్కడి అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్ సర్‌ను వ్యతిరేకిస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలో. ఆమె కోల్‌కతాలో పెద్ద ర్యాలీ నిర్వహించి, 'ఒక్క చట్టబద్ధ ఓటర్ తొలగిస్తే బీజేపీ పతనం తప్పదని హెచ్చరించారు. ఈసీఐ అధికారులు రాష్ట్ర సిబ్బందిని బెదిరిస్తున్నారని, ఇది ఎన్ఆర్సీ లాంటి వ్యవస్థగా మారవచ్చని ఆమె ఆరోపణలు చేశారు.డేటా విశ్లేషణల ప్రకారం, 2023 నుంచి జనాభా 13.8% పెరిగినప్పటికీ, ఓటర్ల సంఖ్య 61.6% పెరిగింది, ఇది1.04 కోట్ల అదనపు ఓటర్ల అవకాశాన్ని సూచిస్తోంది. ఈసీఐ అసాధారణ పెరుగుదలను గుర్తించి, డేటా మ్యాపింగ్ పూర్తి చేసింది,కానీ టీఎంసీ పార్టీఇదిరాజకీయ ఆయుధంగా మారవచ్చని భయపడుతోంది. ఈ వివాదం, ఓటర్ లిస్ట్ ఇన్‌ఫ్లేషన్‌ను ఎలా నియంత్రించాలో దేశానికి సవాలుగా మారింది. కేరళలోనూ తేడాలు ఉన్నాయి. రాష్ట్ర జనాభా 3.60 కోట్లు ఉండగా, ఆధార్ కార్డులు 4.09 కోట్లు ఉన్నాయి, అంటే 49 లక్షల అదనపు కార్డులు. ఇవి రేషన్ కార్డులతో లింక్ అయి, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో దుర్వినియోగానికి దారితీస్తున్నాయని విమర్శకులు చెబుతున్నారు. రాష్ట్రంలో 32 లక్షల బోగస్ రేషన్ కార్డులు ఉన్నాయని పాత అంచ నాలు ఉన్నాయి, వనరుల రక్షణ, సవాళ్లుసర్‌తోపాటు ఆధార్‌ఆధారిత వెరిఫికేషన్ ద్వారా దేశవ్యాప్తంగా 5.8కోట్ల ఫేక్ రేషన్ కార్డులు తొలగించబ డ్డాయి, ఇది పీడీఎస్ వ్యవస్థను శుద్ధి చేసి,బ్లాక్ మార్కెట్‌లీకేజీలను తగ్గించింది. సమతుల్య అమలు కోసం సూచనలు సర్ ప్రక్రియ భారత డెమోక్రసీకి అవసరమైన సంస్కరణ. ఎందుకంటే ఇది ఫేక్ ఎంట్రీలను తొలగించి, నిజమైన ఓటర్ల హక్కులనురక్షిస్తుంది. అయితే,బిహార్, బెంగాల్ వంటి ఉదాహరణలు చూపిస్తున్నట్టు, రాజకీయ జోక్యాలు, టెక్నికల్ లోపాలు దీన్ని సున్నితంగా మారుస్తున్నాయి. ఈసీఐకు స్వతంత్ర విమర్శకుల సలహాలు, డేటా ట్రాన్స్‌పరెన్సీ, రాష్ట్రాలతో సమన్వయం అవసరం

# పిల్లలకు సోషల్ మీడియా నిషేధం..




### డెన్మార్క్‌ప్రభుత్వం నిర్ణయం
### 15 సం౹౹ల లోపు వారికి అనుమతి నిరాకరణ

కొపెన్‌హెగెన్ : డెన్మార్క్ ప్రభుత్వం 15 సంవత్సరాలలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించింది. దీనికి సంబంధించిన నివేదికను ఆ దేశ డిజిటలైజేషన్ మంత్రిత్వ శాఖ శుక్రవారం విడుదల చేసింది. సోషల్ మీడియా పిల్లల మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది. నిద్రకు అంతరాయం కలుగుతుందని, ఏకాగ్రత కోల్పోతున్నారని తెలిపింది. ఆన్‌లైన్ మోసాలకు పిల్లలు బలైపోతున్నారని అధికారులు వెల్లడించారు.. డిజిటలైజేషన్ మంత్రి మీడియాతో మాట్లాడుతూ సోషల్ మీడియా పిల్లల బాల్యాన్ని, వారి సమయాన్ని, వారి ఆనందాన్ని దోచుకుంటోందని, దానికి తాము ముగింపు పలుకుతున్నామని ప్రకటించారు. ఆన్‌లైన్ ప్రపంచంలో హానికరమైన కంటెంట్, వాణిజ్య ప్రభావాలు తీవ్రమైపోయాయని, వాటి నుండి యువతను రక్షించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన కొత్త మార్గదర్శకాల్లో యుట్యూబ్, స్నాప్‌చాట్, ఇన్‌స్టా గ్రామ్, టిక్‌టాక్ వంటి దిగ్గజ సంస్థలపై నియంత్రణలు ఉన్నాయి. అయితే 13 సంవత్సరాలు దాటిన వారికి తల్లిదండ్రుల సమక్షంలో అనుమతించనున్నారు. అదీ పరిమిత కాలం వరకే.
కొన్ని నెలల క్రితం ఆస్ట్రేలియా ఇటువంటి నిర్ణయాన్నే తీసుకుంది. యూరోపియన్ యూనియన్ దేశాల్లో సోషల్ మీడియాను వయో పరిమితి ఆధారంగా నియంత్రించిన మొదటి దేశంగా డెన్మార్క్ నిలిచింది. ఈ నిర్ణయంతో పిల్లల్లో మానసిక ఆరోగ్యం, వారి అభివృద్ధికి, విచ్చలవిడిగా పెరిగిపోతున్న సోషల్ మీడియా నియంత్రణకు దోహదపడుతుందని పలువురు భావిస్తున్నారు.

# రాయలసీమలో రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు

**తిరుపతి,తెలంగాణ దిశ :**ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడులు రానున్నాయి. రూ. 22 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ సిద్ధమైంది. పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో ఈ పెట్టుబడులు పెట్టనుంది. త్వరలో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సమావేశంలో ఈ మేరకు ప్రభుత్వం, కంపెనీ మధ్య అవగాహన ఒప్పంద కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 77 వేల ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ పెట్టుబడి రానుంది. రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్తు, బయోమాస్, డేటా సెంటర్లు, పోర్టుల రంగాల్లో.. రూ.22,000 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా ప్రత్యక్షంగా 7000 మందికి, పరోక్షంగా 70 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉందని అంచనా.కాగా, విశాఖపట్నంలో నవంబర్14,15 తేదీల్లో జరగనున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని సమాచారం. రాయలసీమలోని కడప, కర్నూలు జిల్లాల్లో.. 1,750 మెగావాట్ల సోలార్/ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టం ప్రాజెక్టులు ఏర్పాటు చేసే అవకాశం ఉంది. నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్ కార్పొరేషన్ , సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా టెండర్లలో భాగంగా ఎస్ఏఈఎల్ ఈ ప్రాజెక్టులు చేపడుతోం ది. పరిశ్రమలు, డేటా సెంటర్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయడం లక్ష్యంగా వీటిని నిర్మిస్తున్నారు. అంతేకాకుండా 200 మెగావాట్ల బయోమాస్ ప్రాజెక్టును చేపడుతున్నారు. అందులో భాగంగా 25 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పలు బయోమాస్ ప్లాంట్లను నిర్మిస్తారు. వ్యవసాయ వ్యర్థాలను ఉపయోగించడం వల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. అంతేకాకుండా, రూ. 3000 కోట్లతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. దీని ద్వారా రాష్ట్రంలో అభివృద్ధి చెందుతున్న డిజిటల్ అవకాశాలు వినియోగించుకోవచ్చు. మారిటైం రంగంలో లాజిస్టిక్స్‌ను, ఎగుమతులను బలోపేతం చేసేందుకు రూ.4000 కోట్ల పెట్టుబడితో పోర్టు ఆధారిత మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నారు. కాగా, తమ కంపెనీ ఇప్పటికే ఏపీలో రూ. 3,200 కోట్లు పెట్టుబడులు చేసినట్లు ఎస్ఏఈఎల్ తెలిపింది. 9 నెలల్లో 600 మెగావాట్ల సామర్థ్యాన్ని ప్రవేశపెట్టినట్లు తెలిపింది.కాగా, రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్ల నెట్వర్క్ ఏర్పాటు, గ్రీన్ ట్రాన్స్‌పోర్టు సిస్టమ్ అభివృద్ధి చేసేందుకు రూ.20 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ఇటీవల హిందూజా గ్రూప్ ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే.తర్వాత శుద్ధ ఇంధనం (క్లీన్ ఎనర్జీ) రంగంలో ఏపీకి భారీ పెట్టుబడులు వచ్చాయి. కర్నూలు జిల్లాలో బ్రూక్ ఫీల్డ్ చేపట్టనున్న రెన్యువబుల్ ఎనర్జీ ప్రాజెక్టు కోసం రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఆర్ఇఅ) రూ.7,500 కోట్ల నిధులు మంజూరు చేసింది. మొత్తం రూ.9,910 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అందులో భాగంగా 640 మెగావాట్ల పవన విద్యుత్, 400 మెగావాట్ల సౌర శక్తితో.. మొత్తంగా 1040 మెగావాట్ల హైబ్రిడ్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. కాగా, ఇప్పటివరకు ఒక ప్రైవేట్ ప్రాజెక్టుకు ఆర్ఈసీ.. ఇంత భారీ మొత్తంలో నిధులు ఇవ్వడం ఇదే మొదటిసారి అని అధికార వర్గాలు వెల్లడించాయి.

# ఆల్‌ఖైదా అనుబంధ సంస్థ దురాగతం

## మాలీలో ఐదుగురు భారతీయుల కిడ్నాప్

న్యూఢిల్లీ: ఆఫ్రికా దేశం మాలీలో ఐదుగురు భారతీయులను ఉగ్రమూకలు కిడ్నాప్ చేశాయి. ఇది అల్‌ఖైదా ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న మూకల పనేనని అక్కడి వార్తాలు చెబుతున్నాయి. స్థానికంగా ఎలక్ట్రిఫికేషన్ ప్రాజెక్టు చేపడుతున్న సంస్థలో ఆ ఐదుగురు పనిచేస్తున్నారు. వారు కిడ్నాప్‌కు గురైన విషయాన్ని సంస్థ ధ్రువీకరించింది. రాజధాని బొమాకోలోని మిగతా భారతీయులను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్టు సంస్థ ప్రతినిధి తెలిపారు. అయితే, ఈ విషయంపై అక్కడి ఉగ్రవాద సంస్థలు ఏవీ ఇంకా స్పందించలేదు.మాలీలో ప్రస్తుతం
మిలటరీ జంటా పాలన సాగుతోంది. మరోవైపు అల్ ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ఉగ్రసంస్థలకు అనుబంధంగా పనిచేస్తున్న ఉగ్రమూకలు దేశంలో రణరంగం సృష్టిస్తున్నాయి. వారికి అడ్డుకట్ట వేయలేక సైన్యం నానా కష్టాలు పడుతోంది. అసలే ఆర్థికకష్టాల్లో ఉన్న దేశంలో అంతర్గత కుమ్ములాటలు పరిస్థితిని నానాటికీ దిగజారుస్తున్నాయి. అల్ ఖైదా అనుబంధ జేఎన్ఐఎమ్ ఉగ్రసంస్థ దేశంలోకి ఇంధనం రాకుండా అడ్డుకోవడంతో అవస్థలు తీవ్రమయ్యాయి. మాలీలో విదేశీయుల అపహరణలు నిత్యకృత్యంగా మారాయి. వర్గాల మధ్య కుమ్ములాటలతో మాలీ 2012 నుంచి అల్లకల్లోలంగా మారింది. సెప్టెంబర్‌లో కూడా జేఎన్ఐఎమ్ ఉగ్రవాదులు విదేశీయులను కిడ్నాప్ చేశారు. యూఏఈకి చెందిన ఇద్దరిని, ఒక ఇరాన్ దేశస్థుడిని బొమాకోకు సమీపంలో కిడ్నాప్ చేశారు. 50 మిలియన్ డాలర్లు ఇచ్చాక వారిని విడిచిపెట్టారు.

## ప్రజల జీవన స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ సర్వే

రామగుండం: రామగుండం కార్పొరేషన్ ప్రజల జీవన స్థితిగతులపై జాతీయ గణాంక శాఖ సర్వే నిర్వహిస్తున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ రామగుండం మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ అరుణశ్రీని రామగుండం మున్సిపల్ ఆఫీసులో గుర్రం శ్రీనివాస్ గౌడ్ కలిసి సర్వేకు సంబంధిం చినటువంటి కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా గుర్రం శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పట్టణాలలో రామగుండంఉందని పట్టణా లు గ్రామాలలో ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వే చేసినట్లు తెలిపారు.

# కొరియన్ భాషలో కూడా నటించాలనుందట..!

## హాట్ టాపిక్‌గా రష్మిక మందన్నా కామెంట్స్



బాలీవుడ్ నటుడు ఆయుష్మాన్ ఖురానా, రష్మిక మందన్నా కాంబోలో వచ్చిన చిత్రం థామా. హార్రర్ సినిమాటిక్ యూనివర్స్‌లో మ్యాడ్ డాక్ ఫిలిమ్స్ తెరకెక్కించిన ఈ మూవీ అక్టోబర్ 21న విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. మరోవైపు ఇటీవలే తెలుగులో ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాగా మంచి టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. బ్యాక్ టు బ్యాక్ సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్న రష్మిక ఓ ఆసక్తికర విషయాన్ని అభిమానులు, ఫాలోవర్లతో షేర్ చేసుకుంది. తన ఫిల్మోగ్రఫీలో భిన్నమైన సినిమాలుండేలా ప్లాన్ చేసుకునే రష్మిక కొరియన్ సినిమా చేయడంపై అడిగిన ప్రశ్నకు స్పందించింది. అవును.. కొరియన్ డ్రామా చేయాలనుకుంటున్నా. అవి చాలా ఫన్‌గా ఉంటాయి. కానీ వాళ్లు (మేకర్స్) నాకు ఏం ఇస్తున్నారనే దానిపై కూడా ఇది ఆధారపడి ఉంటుంది. ఎందుకంటే నేను స్క్రీన్‌పై ఏం చేయగలనో మీకు తెలుసు..
కథ నాకు సెట్ అవుతుందనిపిస్తే కొరియన్ ప్రాజెక్ట్ చేసేందుకు రెడీనంటూ చెప్పుకొచ్చింది. నాకు కొరియన్ సినిమాలపై ప్రేమ కోవిడ్‌టైంలోనే మొదలైంది. కోవిడ్ సమయంలో నా చేతిలో చాలా టైం ఉంది కాబట్టి కొరియన్ డ్రామాల గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. ప్రతీ కొరియన్ డ్రామా 16 ఎపిసోడ్స్‌గా ఉంటుంది. అంటే మీరు ఒక కొరియన్ ప్రాజెక్ట్‌ను స్క్రీన్‌పై చూడాలంటే రోజులో 16 గంటలు కేటాయించవచ్చన్నది రష్మిక మందన్నా. ఈ కామెంట్స్‌తో ఇక రాబోయే కాలంలో కొరియన్ సినిమాలు కూడా చేసినా ఆశ్చర్యపోనవసరం లేదని రష్మిక హింట్ ఇచ్చేస్తుంది.

# చాలా కాలం తర్వాత అసలైన రామ్ చరణ్‌ను చూశా



సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తనదైన శైలిలో స్పందిస్తూ తరచూ వార్తల్లో నిలుస్తుంటారు. తాజాగా ఆయన మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌పైనా, యువ దర్శకుడు బుచ్చిబాబుపైనా ప్రశంసల వర్షం కురిపించారు. రామ్ చరణ్ కథానాయకుడిగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం నుంచి విడుదలైన 'చికిరి చికిరి' పాట సృష్టించిన సంచలనంపై వర్మ స్పందించారు. ఈ పాటలో చరణ్ నటనను, అతన్ని చూపించిన విధానాన్ని మెచ్చుకుంటూ తనఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. "సినిమాలోని ప్రతి కళారూపం, ప్రతి విభాగం అసలు ఉద్దేశ్యం హీరోను మెరుగుపరచడమేచాలా కాలం తర్వాత రామ్ చరణ్‌ను తన అసలైన, సహజమైన, అద్భుతమైన రూపంలో చూశాను. 'చికిరి చికిరి' పాటలో చరణ్ ప్రదర్శించిన నటన, ఆవేశం, ఎనర్జీ నేను ఈ మధ్య కాలంలో చూసిన అత్యుత్తమ ప్రదర్శన" అని రామ్ గోపాల్ వర్మ కొనియాడారు. అంతేకాకుండా, దర్శకుడు బుచ్చిబాబును ఉద్దేశించి వర్మ ప్రత్యేకంగా ప్రశంసించారు. "ఒక స్టార్ తన చుట్టూ అతి తళుకుబెళుకుల మధ్య కాదు, సహజత్వంతో ఉన్నప్పుడే అత్యంత ప్రకాశవంతంగా కనిపిస్తాడు. నువ్వు ఆ విషయాన్ని అద్భుతంగా అర్థం చేసుకున్నావు.
భారీ సెట్స్, వందల మంది డ్యాన్సర్లు లేకుండా, అసలు దృష్టి మొత్తం హీరోపైనే నిలిపావు" అంటూ బుచ్చిబాబు దర్శకత్వ ప్రతిభను మెచ్చుకున్నారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నా యి. ఇటీవల ఏఆర్ రెహమాన్ సంగీత సారథ్యంలో విడుదలైన 'చికిరి చికిరి' పాట దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. విడుదలైన కొన్ని గంటల్లోనే లక్షల వ్యూస్‌తో ట్రెండింగ్‌లోకి చేరి రామ్ చరణ్ పాన్-ఇండియా క్రేజ్‌ను మరింత పెంచింది. ఈ నేపథ్యంలో రామ్ గోపాల్ వర్మ చేసినఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతూ సినిమాపై అంచనాలను రెట్టింపు చేస్తున్నాయి.

# హృదయాన్ని తాకే ఎమోషన్స్‌తో రమణి కళ్యాణం




దీప్శిక, సూర్య వశిష్ట ప్రధాన పాత్రల్లో విజయ్ ఆదిరెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం రమణి కళ్యాణం. ఈ సినిమా టైటిల్‌ను అధికారికంగా చిత్రబృందం లాంచ్ చేసింది. కిరణ్ అబ్బవరం, వశిష్ట, విజయ్ ఆంటోనీ, జీవీ ప్రకాశ్ కుమార్, సామ్ సిఎస్, రంజిత్ జేయకొడి వంటి ప్రముఖులు ఈ టైటిల్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్ర బృందానికి వారు శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలోని సవాళ్ల మధ్య ప్రేమ, విలువలు,
హృదయాన్ని తాకే ఎమోషన్స్ తో అందమైన ప్రయాణంగా ఈ సినిమా ఉండబోతోందని చిత్రబృందం తెలిపింది. వినోదం, భావోద్వేగం, విలువలతో కూడిన కథను నిజాయితీగా చెప్పబోతోన్నామని పేర్కొంది. ఈ చిత్రానికి సూరజ్ ఎస్ కురుప్ మ్యూజిక్ అందిస్తున్నారు. అరవింద్ తిరుకోవెల డీవోపీ, రవితేజ గిరిజాల ఎడిటర్. యువరాజ్ తేజ కాంద్రకోట, రామ్ జగదీశ్, విజయ్ ఆదిరెడ్డి స్క్రీన్ ప్లేని అందిస్తున్నారు. కోర్ట్ సినిమాతో బ్లాక్‌బస్టర్ సక్సెస్ అందుకున్న డైరెక్టర్ రామ్ జగదీశ్ ఈ చిత్రానికి డైలాగ్స్, స్క్రీన్ ప్లే అందించడం విశేషం. రమణి కళ్యాణం తన అందమైన ప్రయాణాన్ని ఈరోజు ప్రారంభించింది. త్వరలోనే ఫస్ట్ లుక్ పోస్టర్లు, టీజర్, ట్రైలర్ లాంటి ఆసక్తికర అప్‌డేట్స్ రానున్నాయి.

# హాలీవుడ్‌లో కూడా వివక్ష!



అగ్ర కథానాయిక దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. భారతీయ నటీనటుల పట్ల అక్కడి వారు వివక్ష చూపిస్తుంటారని, అది అందరికీ తెలిసిన విషయమే అని పేర్కొంది. భారతీయ సినిమాలో తిరుగులేని గుర్తింపును దక్కించుకున్న ఈ మంగళూరు సోయగం హాలీవుడ్‌లో కూడా సత్తా చాటుతున్నది. 'ట్రిబుల్ ఎక్స్: రిటర్న్ ఆఫ్ గ్జాండర్ కేజ్' వంటి చిత్రాలతో పాటు పలు అంతర్జాతీయ ఉత్పత్తులకు ఆమె బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తూ గ్లోబల్ ఐకాన్‌గా పేరు తెచ్చుకుంది. ఓ ఇంటర్నేషనల్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో దీపికా పదుకొణె హాలీవుడ్ ఇండస్ట్రీ గురించి మాట్లాడింది. 'అందరూ అనుకుంటున్నట్లుగా హాలీవుడ్‌లో ప్రతిదీ నిజాయితీగా, సక్రమంగా ఏమీ ఉండదు. భారతీయ నటీనటులు అక్కడ వివక్షను ఎదుర్కొం టారు. ముఖ్యంగా శరీర రంగు ఆధారంగా వివక్ష చూపిస్తుంటారు. ఉద్దేశ్యపూర్వకంగా అలాంటివి జరుగుతుంటాయి. స్కిన్ కలర్‌తో పాటు మన ఇంగ్లీష్ యాసపై కూడా అక్కడ చిన్నచూపు ఉంటుంది. అందుకే హాలీవుడ్‌లో అవకాశాలు దక్కించుకొని సక్సెస్ కావడం అంత సులభం కాదు. అయితే ఎలాంటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా సరే ఓ భారతీయురాలిగా నా గొంతును బలంగా వినిపించే ప్రయత్నం చేస్తుంటా. నా మూలాలను గౌరవించే వారితోనే పనిచేస్తానని నిక్కచ్చిగా చెబుతాను' అని దీపికా పదుకొణె పేర్కొంది. 'స్పిరిట్' 'కల్కి' వంటి పాన్ ఇండియా తెలుగు చిత్రాల నుంచి దీపికా పదుకొణె తొలగింపు వ్యవహారం జాతీయ స్థాయిలో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీపికా పదుకొణె ప్రస్తుతం బాలీవుడ్, హాలీవుడ్ చిత్రాలపై దృష్టి పెడుతున్నది.

# ఇప్పటి వరకు రాని కథ!



కన్నడ భామ రుక్మిణి వసంత్ వరుసగా భారీ చిత్రాలతో బిజీగా ఉంది. ఇటీవల విడుదలైన బ్లాక్‌బస్టర్ హిట్ 'కాంతార: చాప్టర్ 1'లో యువరాణి కనకావతి పాత్రలో ఆమె అభినయానికి మంచి ప్రశంసలు దక్కాయి. ప్రస్తుతం ఈ భామ కన్నడంలో యశ్‌తో కలిసి 'టాక్సిక్', తెలుగులో ఎన్టీఆర్ 'డ్రాగన్' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. ఈ సందర్భంగా తాజా ఇన్‌స్టాగ్రామ్ చిట్‌చాట్‌లో అభిమానులతో ఈ సొగసరి 'టాక్సిక్' సినిమా విశేషాలను పంచుకుంది. ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్‌పై రానటువంటి వినూత్న కథాంశమిదని, రా అండ్ రస్టిక్‌గా ఉంటుందని చెప్పింది. 'ఈ కథ ఎన్నో లేయర్స్‌తో కూడుకొని అద్భుతంగా ఉంటుంది. దర్శకురాలు గీతూమోహన్‌దాస్ గొప్ప విజన్‌తో తెరకెక్కిస్తున్నారు. ఈ కథలో హృదయాన్ని కదిలించే ఎమోషన్స్ కూడా ఉంటాయి.' అని రుక్మిణి వసంత్ చెప్పింది. 'కేజీఎఫ్-2' తర్వాత యశ్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'టాక్సిక్'పై ఇప్పటికే అంచనాలేర్పడ్డాయి. వచ్చే ఏడాది మార్చి 16న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

# శరీరాకృతి ఎప్పుడూ ఒకేలా ఉండదు..



మహిళలశరీరాకృతి ఎప్పుడూ ఒకేలాఉండదని,ఐదేళ్లకు ఓసారి మార్పులు జరుగుతుంటాయని ప్రముఖ నటి తమన్నా భాటియా పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ఒకే శరీరాకృతితో కనిపించలేమని ఆమె వివరించారు. బరువు తగ్గేందుకు ఇంజెక్షన్లు వాడుతున్నారంటూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తూ తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. పదిహేనేళ్ల వయసు నుంచే తాను నటిస్తున్నానని తెలిపారు. అప్పుడు ఎలా ఉన్నానో ఇప్పటికీ అలాగే ఉన్నానని తాను భావిస్తున్నట్లు చెప్పారు. అయితే, సినిమాల్లోని పాత్రల కోసం ఒక్కోసారి బరువు పెరగడం, మరోసారి తగ్గడం చేయాల్సి వస్తుందని తమన్నా వివరించారు. చిన్న వయసులోనే సినిమాల్లోకి వచ్చానని, కెమెరాతో తన ప్రయాణం సాగుతోందని చెప్పారు. ఇందులో దాచిపెట్టడానికి ఏమీలేదన్నారు. చిరంజీవి సినిమాలో ఐటెం సాంగ్..!: ఇటీవల కాలంలో తమన్నా స్పెషల్ సాంగ్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా మారారు. ఆమె నటించిన 'కావాలయ్య', 'డా డా డాస్' వంటి పాటలు షేక్ చేశాయి. ఇప్పుడు అదే జోరుతో చిరంజీవి సినిమాలో కూడా మాస్ ఆడియన్స్‌కు అదిరిపోయే కిక్ ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. చిరంజీవి లేటెస్ట్ మూవీ 'మన శంకర వరప్రసాద్ గారు'లో స్పెషల్ సాంగ్ ఉండనుందని, అందులో మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా మెగాస్టార్‌తో కలిసి స్టెప్పులేయనున్నారని సమాచారం.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215